ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
శనివారం 5 జూలై 2025



మన్యం వీరుడు.. అల్లూరి సీతారామరాజు

● అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి

రాయచోటిటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తన జీవితాన్ని దేశమాత స్వేచ్ఛ కోసం సమర్పించిన మన్యంవీరుడు అల్లూరి సీతామరాజు అని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పగుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ 1897 జూలై 4న విశాఖపట్టణం జిల్లా పాండ్రంగిలో జన్మించిన అల్లూరి 1917లో విశాఖపట్టణం జిల్లా క్రిష్ణదేవీపేట ద్వారా మన్యంలోకి అడుగుపెట్టారన్నారు. అక్కడి ప్రజల దీన స్థితిగతులను పరిశీలించి బ్రిటీష్ అధికారుల నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా విప్లవానికి సిద్ధం కావాలని మన్యం ప్రజలను మేల్కొల్పారన్నారు. మన్యం వాసుల కష్టాలను కడతేర్చేందుకు, తెల్లదొరల దోపిడీని ఎదుర్కొనేందుకు గిరిజనులకు అండగా నిలిచి పోరాటం చేయాలని సీతారామరాజు నిర్ణయించుకున్నారన్నారు. వారికి తమ హక్కులను వివరించి వారిలో ధైర్యాన్ని పెంపొందించి అన్యాయాలను ఎదిరించే విధంగా తయారు చేశారన్నారు. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు, అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ ఎం.శ్రీనివాసులు, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరాం, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, జాన్‌జోషఫ్, పెద్దయ్య, ఇతర పోలీసు అధికారులు, డీపీవో సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

అల్లూరి.. మహోజ్వల శక్తి : డీఆర్‌వో

రాయచోటి(కలెక్టరేట్), జూలై 4(ఆంధ్రజ్యోతి): స్వరాజ్య సంగ్రామ చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని, ఆయన దేశ భక్తి, ధైర్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని డీఆర్‌వో మధుసూదన్ రావు పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో యువజన సర్వీసుల శాఖ, స్టెప్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన్యంవీరుడు అల్లూరి స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయుడన్నారు. ఈయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం అని, నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులకు అండగా నిలిచారని తెలిపారు. బ్రిటీష్ వారిని ఢీకొనడంలో ఆయన చూపిన ధైర్యం, తెగువ భావితరాలకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టెప్ సీఈవో సాయిగ్రేస్, డీఈవో సుబ్రమణ్యం, ఏపీ టూరిజం అధికారి నాగభూషణం, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొహర్రం పండుగను ప్రశాంతంగా జరుపుకోండి

● శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 3(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అందరూ కలిసి మెలిసి మత సామర్యానికి ప్రతీకగా పండుగ జరుపుకోవాలని ఆయన సూచించారు. గ్రామ పెద్దలు, చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్తేజభరితంగా జరుపుకునే ఈ పండుగలో అల్లర్లకు, అసాంఘిక కార్యకలాపాలకు తావుండదన్నారు. ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలగాలని సూచించారు. జిల్లాలో మొహర్రం ప్రశాంత వాతావరణంలో ముగిసే విధంగా పోలీసుశాఖకు జిల్లా ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు. చట్టవిరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పండుగకు ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఒక అరెస్టు.. ఎన్నో భయాలు..

మరెన్నో సందేహాలు

రాయచోటిలో జరిగిన అల్ ఉమా ఉగ్రవాదుల అరెస్టు.. ప్రజల్లో ఎన్నో భయాలను.. మరెన్నో సందేహాలను మిగిల్చింది. "30 సంవత్సరాలుగా ఉగ్రవాదులు రాయచోటిలో నివాసం ఉన్నా.. వారు ఎవరైందీ తెలియక.. వాళ్లతో సన్నిహితంగా తిరిగాము.. ఫోన్లలో మాటామంతీ నడిచింది.. తీరా చూస్తే.. వాళ్లు అరెస్టు అయ్యారు.. ఇప్పుడు మా పరిస్థితి ఏంటి" అనే భయం పట్టణంలోని పలువురిలో కనిపిస్తోంది. అదే సమయంలో మూడు దశాబ్దాలుగా ఇక్కడ ఉన్న ఉగ్రవాదులు.. ఈ ప్రాంతంలో ఎంతమందికి తమ భావజాలం ఎక్కించి ఉగ్రవాదులుగా... సానుభూతి పరులుగా మార్చుకున్నారో? అనే భయం.. సామాన్య జనంలో కనిపిస్తోంది.

మరోవైపు.. పోలీసులు ఉగ్రవాదులను అరెస్టు చేయడంతో పాటు.. బాంబులు, బాంబు తయారీ పదార్థాలను స్వాధీనం చేసుకోకుంటే.. ఏం జరిగేదో? ఊహించుకోవడానికే భయంగా ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో.. కడప, అన్నమయ్య జిల్లాల్లో ఏ ఊర్లో చూసినా.. ఉగ్రవాదుల గురించే చర్చ నడుస్తోంది. సందెట్లో సడేమియా అన్నట్లు.. అదిగో పులి అంటే.. ఇదిగో తోక అని పుకార్లు కూడా జోరుగా షికారు చేస్తున్నాయి. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించేందుకు రంగంలోకి కేంద్ర దర్యాప్తు బృందాలు దిగినట్లు తెలుస్తోంది.



రాయచోటిలోని ఉగ్రవాదుల ఇళ్లలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు, ల్యాప్‌టాప్‌లు, బాంబు తయారీ పదార్థాలు



ఉగ్రవాదుల ఇంట్లో నుంచి స్వాధీనం చేసుకున్న బాంబును నిర్వీర్యం చేసేందుకు ఊరవతల పొలం వద్ద పోలీసుల ప్రయత్నం

● భగ్నమే చేయకుంటే.. ఏం జరిగేదో?

● ఊరంతా ఉగ్రవాదుల చర్చే

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పోలీసులు సోమవారం అర్ధరాత్రి అబూబక్కర్ సిద్ధిఖీ అలియాస్ అమానుల్లా, మహమ్మద్ అలీ అలియాస్ మన్సూర్‌లను అరెస్టు చేశారు. వీళ్ల ఇద్దరూ 1995 నుంచి తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలలో పలుచోట్ల బాంబుపేలుళ్లకు పాల్పడ్డట్లు కేసులు ఉన్నాయి. అందులో ప్రముఖంగా బీజేపీ సీనియర్ నాయకులు ఎల్‌కే అద్వానీని హత్య చేయడానికి ప్రయత్నించారన్న కేసు ఉంది. ఇంకా పలు కేసుల్లో అరెస్టు అయి.. బెయిల్ మీద బయటకు వచ్చి.. కోర్టుకు హాజరుకాకుండా పారిపోయి రాయచోటిలో స్థిరపడ్డారు. 30 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటూ.. 2011లో బెంగళూరులోని మంగళూరులో బాంబుపేలుళ్లకు పాల్పడిన కేసులో అబూబక్కర్ ప్రధ వ ు ముద్దాయిగా, మహమ్మద్ సైతం ఈ సంఘటనలో పాలుపంచుకున్నట్లు కేసులు ఉన్నాయి. అయినప్పటికీ వీళ్ల తమ ఆచూకి తెలియకుండా.. రాయచోటిలోనే మకాం పెట్టి.. ఇక్కడే పెళ్లిళ్ల చేసుకుని.. పిల్లలను కూడా కన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ఇంటలిజెన్స్ బ్యూరో పోలీసులు నాన్‌బెయిలబుల్ వారెంటు కోసం వీళ్లను వెతకడం ప్రారంభించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆధ్వర్యంలో.. మారువేషాలలో తిరిగిన ఆ పోలీసులు ఉగ్రవాదుల జాడ కనిపెట్టి.. జిల్లా పోలీసుల సాయంతో అరెస్టు చేసి తమతో తీసుకెళ్లిపోయారు. తర్వాత.. ఉగ్రవాదుల భార్యలను సైతం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. తర్వాత విషయాలే స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

అందరిలో ఆందోళన

అబూబక్కర్ సిద్ధిఖీ పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతంలో చిల్లర దుకాణాన్ని నిర్వహిస్తూ ఉన్నాడు. మహబూబ్‌నగర్ వీధిలో నివాసం ఉన్న మహమ్మద్ అలీ చిల్లర దుకాణంతో పాటు.. చీరల దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. వీళ్ల దుకాణాలకు రోజూ వచ్చి పోయిన స్థానికులు ఇప్పుడు వణికిపోతున్నారు. ఇప్పటికే ఆ ఉగ్రవాదులతో సన్నిహితంగా మెలిగిన పలువురిపై పోలీసులు నిఘా ఉంచారు. కొందరిని తమ అదుపులోకి తీసుకుని తమ శైలిలో విచారిస్తున్నారు. చిల్లర, చీరల దుకాణం ఉండడంతో.. పెద్దసంఖ్యలో జనాల ఫోన్ నంబర్లు ఉగ్రవాదుల దగ్గర ఉన్నాయి. వీళ్ల నంబర్లకు పదేపదే ఫోన్లు కూడా వెళ్లాయి. ఈ నంబర్లను చూసి.. పోలీసులు

- తరువాయి 6లో..



ఇసుక బస్తాల మధ్య ఉంచిన బాంబులను డిస్పోజ్ చేస్తున్న దృశ్యం



నిర్వీర్యం చేసిన సూట్‌కేస్ బాంబు

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

● ఏపీఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు పద్మావతి

7



సమావేశంలో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి

రైళ్లల్లో తనిఖీలు

వివరాలు...7లో



కడప రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి

మహావిష్ణు స్వరూపుడు.. సౌమ్యనాథుడు

● అంకురార్పణతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

నందలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మహావిష్ణువు స్వరూపుడైన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన అర్చక స్వాములు పాంచరాత్ర ఆగమ పండితుల బృందంతో కలశస్థాపన చేసి హోమం నిర్వహించారు. ఆగ్నేయ మూలల్లో వెలసి ఉన్న పుట్టకు పూజలు చేశారు. పంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా గురుదేవతలను లిఖించి ఆహ్వానించారు. పూజాది కార్యక్రమాల అనంతరం పుట్ట మన్ను సేకరించి అంకురార్పణ మండపంలో ఏర్పాటు చేసిన 12 పాలికల్లో నవధాన్యాలను చల్లి కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం మూలవరులకు, ఉత్సవవరులకు తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.



ముస్తాబైన శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి



పుట్ట వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్న పండితులు

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉత్సవాల్లో భాగంగా 2వ రోజు శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రికి యాలి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బొప్పాయి టన్ను @14 వేలు



● భారీగా పెరిగిన ధరలు

● ఇంకా పెరిగే అవకాశం

● ఆనందంలో రైతులు

● రోజూ 50 లారీల్లో ఎగుమతి

రైల్వేకోడూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బొప్పాయి రైతు పంట పండింది. ఈ ఏడాది బొప్పాయి కాయల ధరలు భారీగా పెరిగాయి. ప్రస్తుతం టన్ను రూ.14 వేలకు అమ్ముతున్నారు. ధరలు ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపారులు అంటున్నారు. ఈ ఏడాది మామిడి రైతులను నిండా ముంచేసింది. ఇతర దేశాలకు ఎగుమతులు లేకపోవడంతో ధరలు భారీగా పడిపోయి, కొనేవారు లేక కాయలను తోటల్లోనే వదిలేశారు. దీంతో మామిడి రైతు నిండా మునిగిపోయాడు. అయితే బొప్పాయి రైతుల ఆశలు ఆవిరి కాకుండా ప్రస్తుతం ధరలు బాగా ఉండటంతో తమ కష్టాలు తీరనున్నాయని రైతులు ఆనందంలో ఉన్నారు. ప్రస్తుతం బొప్పాయి కోతలను వ్యాపారులు ప్రారంభించారు. ప్రస్తుతానికి రోజూ దాదాపు 50 లారీల్లో ఇతర రాష్ట్రాలకు వెళుతున్నాయి. మామిడి సీజన్ ఆఖరి రోజుల్లో ఉండగా బొప్పాయి సీజన్ ప్రారంభమవుతుంది. సీజన్ ప్రారంభం కాగానే ఇతర రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు రైల్వేకోడూరుకు మకాం వేశారు. రైల్వేకోడూరు, ఓబుల వారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాలలో ఈ ఏడాది బొప్పాయి దిగుబడులు రైతులు ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా వచ్చాయని రైతులు అంటున్నారు. నియోజకవర్గంలో మొత్తం 19 వేల హెక్టార్లలో బొప్పాయి సాగవుతోంది. రైల్వేకోడూరు నుంచి ముంబై, తమిళనాడు, కేరళ, అహ్మదాబాద్, ఢిల్లీ, కర్ణాటక, తెలంగాణా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు బొప్పాయి కాయలను ఇక్కడి వ్యాపారులు మార్వాడీల ద్వారా ఎగుమతి చేస్తున్నారు. డిమాండ్ పెరిగే కొద్ది ధరలు పెరుగుదలతో పాటు ఎక్కువ ఎగుమతులు సాగుతాయి. రోజూ 100 లారీలు కూడా ఎగుమతి చేసే పరిస్థితి ఉంటుంది. ఈ ఏడాది కాయలు మంచి సైజుకు వచ్చాయి. చాలా మంది రైతులు ఈ ఏడాది సేంద్రియ సాగు చేపట్టడంతో వీటికి మంచి డిమాండ్ ఉండే అవకాశం ఉంది. మామిడిలో దెబ్బతిన్న రైతులకు బొప్పాయిలో ఆశించిన మేర ఆదాయం లభించే అవకాశం ఉంది.

బొప్పాయికి దళారీల బెడద

బొప్పాయి ధరలకు దళారీ బెడద ఉంది. ఇది చాలా ఏళ్లుగా కొనసాగుతోంది. రైతుకు తక్కువ ధర చెప్పి మార్వాడీల దగ్గర దళారీలు డబ్బులు తీసుకుంటారు. కొందరు బడా రైతులు దళారీలతో పెట్టుకోకుండా నేరుగా మార్వాడీలతో సంబంధాలు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. సన్నకారు రైతులు మాత్రం దళారీలు చెప్పింది నమ్మి తక్కువ ధరకు అమ్ముకుంటూ నష్టపోతున్నారు. దళారీ వ్యవస్థ పోవాలంటే రైతులే నేరుగా ధరల విషయంలో సంబంధాలు పెట్టుకుంటే వ్యాపారం సాఫీగా సాగడమే కాకుండా రైతులు నష్టపోకుండా ఉంటారని పలువురు రైతులు అంటున్నారు.

ఈ ఏడాది మంచి కాపు వచ్చింది

ఈ ఏడాది మంచి దిగుబడులు వచ్చాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది కాయ సైజు లోకి వచ్చింది. కాయల్లో నాణ్యతా ప్రమాణాలు బాగా ఉన్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వినియోగదారులు ఇష్టపడే విధంగా కాయలు ఉన్నాయి. కాయలు మాగితే మంచి రంగు, రుచి ఉంటాయి. ప్రస్తుతం ఉన్న ధరలు రైతులకు అనువుగా ఉన్నాయి.



- బి.వెంకటరమణ,
జంగిటివారిపల్లె, రైల్వేకోడూరు

బొప్పాయి రైతుల్లో ఆనందం

ప్రస్తుతం బొప్పాయి ధరలు బాగా ఉండడంతో రైతులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగులో ఎక్కడా రాజీ కాకుండా చేశాము. చీడపీడలు రాకుండా తోటను కాపాడుకున్నాము. అధికారుల సూచనలు, సలహాలు పాటించాము. కాయలు మంచి సైజుకు వచ్చాయి. నియోజకవర్గంలో అక్కడక్కడా కోతలు ప్రారంభించారు.



- కె.మహేశ్,
జంగిటివారిపల్లె, రైల్వేకోడూరు

విద్యార్థుల మధ్య ఘర్షణ : ఇద్దరికి కత్తిపోట్లు

పీలేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): యువతలో పెట్రేగిపోతున్న హింసాత్మక ధోరణులకు అద్దం పట్టే సంఘటన శుక్రవారం సాయంత్రం పీలేరులో చోటుచేసుకుంది. కళాశాలలో కూర్చునే బెంచీ విషయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య తలెత్తిన స్వల్ప వాగ్వాదం కత్తిపోట్లకు దారితీసింది. పీలేరు పోలీసుల కథనం మేరకు... పట్టణానికి చెందిన హర్షవర్ధన్, సంతోష్, శశిధర్‌లు ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్నారు. కళాశాల తరగతి గదిలో శుక్రవారం మధ్యాహ్నం హర్షవర్ధన్‌కు రిజ్వాన్ అనే మరో విద్యార్థికి కూర్చునే బెంచీ విషయంలో వాగ్వాదం జరిగింది. విద్యార్థులు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణ పడ్డారు. అంతటితో ఆగకుండా ఈ విషయాన్ని రిజ్వాన్ తన అన్న మమహ్మద్ అలీ, అతని స్నేహితులకు తెలియజేయడంతో వారు శుక్రవారం సాయంత్రం స్థానిక చెన్నారెడ్డి కాలనీలో హర్షవర్ధన్, సంతోష్, శశిధర్‌లతో గొడవపడ్డారు. ఈ ఘటనలో రిజ్వాన్, అతని అన్న మహమ్మద్ అలీ, సంతోష్, శశిధర్‌లపై కత్తితో దాడి చేశారు. దీంతో వారిద్దరి వీపులపై గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన విద్యార్థులను పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే కత్తిపోట్లు స్వల్పంగా ఉండడంతో వారిద్దరికీ ప్రమాదం తప్పింది. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ ఈ విషయాన్ని ఇరుపక్షాల విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యానికి తెలియజేసి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గాయపడిన విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశారు. కేవలం ఇంటర్ విద్యార్థులు గ్యాంగ్ వార్‌కు దిగడమే కాకుండా కత్తితో దాడి చేసుకున్నారన్న విషయం పీలేరులో చర్చనీయాంశమైంది.



గాయపడిన సంతోష్ వద్ద వివరాలు సేకరిస్తున్న సీఐ యుగంధర్

విద్యార్థినులను పరామర్శించిన డీఎంహెచ్‌వో



విద్యార్థులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

చిన్నమండెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బోనమల ప్రభుత్వ పాఠశాలలో ఒక తాగుబోతు విద్యార్థులపై చేసిన దాడిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఆరాతీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బోనమల ప్రాథమిక పాఠశాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య సంఘటన స్థలానికి వెళ్లి బాలికలను, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం బలికలపై దాడి జరిగిన వెంటనే చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు వెళ్లి చికిత్స చేశారన్నారు. మెరుగైన వైద్యం అందించారన్నారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి బాలికలను పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులపై దాడి చేస్తుంటే ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

డైలేరియా ప్రాణాంతక వ్యాధి

● రాయచోటి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య

సుండుపల్లె, జూలై4(ఆంధ్రజ్యోతి): డైలేరియా ప్రాణాంతక వ్యాధి అని రాయచోటి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య తెలిపారు. శుక్రవారం సుండుపల్లె మండలంలోని ఈడిగపల్లెలో సంకరజాతి పాడి పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఉచితంగా విడుదల చేసిన ఖరీదైన యాంటీ ప్రొటోజోల్ టీకాను 25 పాడి పశువులకు వేశామన్నారు. పాల ఉత్పత్తి కోసం రైతులు వేలాది రూపాయలు వెచ్చించి సంకరజాతి పాలిచ్చే పశువులను కొనుగోలు చేసి ఉంటారని, పిడుదుల ద్వారా వ్యాపించే డైలేరియా ప్రాంణాంతక వ్యాధి నుంచి కాపాడేందుకు ఈ టీకాను తప్పనిసరిగా వేయించాలన్నారు. జ్వరం, రక్తహీనత, వ్యాధినిరోధక శక్తి తగ్గడం, పాల దిగుబడి తగ్గడం, పశువులు నీరసించిపోవడం, బూడిదరంగు మూత్రంతో పాటు మరికొన్ని లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు కల్పిస్తే వెంటనే పశుసంవర్ధక శాఖ వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాకులు డాక్టర్ విజయ్‌కుమార్, సహాయ సంచాలకులు డాక్టర్ రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పాడి పశువులకు యాంటీ ప్రొటోజోల్ టీకాలు వేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య

ఒక అరెస్టు.. ఎన్నో భయాలు..

మరెన్నో సందేహాలు

● భగ్నమే చేయకుంటే.. ఏం జరిగేదో?

● ఊరంతా ఉగ్రవాదుల చర్చే

(మొదటిపేజి తరువాయి)

తమనెక్కడ విచారణకు పిలుస్తారో? అని చాలా మంది హడలిపోతున్నారు. అదే సమయంలో చాలా మందికి ఉగ్రవాదులతో ఆర్థిక లావాదేవీలు నడిచాయి.. ఇప్పుడు వీళ్లంతా ఆందోళన చెందుతున్నారు.

అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలు..

చుట్టుపక్కల వాళ్లకు వీళ్ల ఎవరైందీ తెలియకుండా.. ఇన్ని సంవత్సరాలు ఎలా రహస్యంగా ఉంచగలిగారు? నిజంగానే.. స్థానికులు ఎవరికీ వీళ్ల ఎవరైందీ తెలియదా? కొంతమందికైనా తెలుసా.? ఎవరైనా అమాయకులు వీళ్ల ఉచ్చులో చిక్కుకున్నారా? ఇటీవల పట్టణంలో జరిగిన కొన్ని సంఘటనల వెనుక.. ఈ ఉగ్రవాదుల ప్రమేయం ఉందా? వీళ్లతో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన.. వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే అనుమానాలు ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి.

భగ్నమే చేయకుంటే.. ఎంత విధ్వంసమో ?

ఉగ్రవాదుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన పోలీసులు.. అబూబక్కర్ సిద్దిఖీ ఇంట్లో పెద్ద ఎత్తున బాంబులు తయారీ పదార్థాలు, కొంత ఉగ్రవాద సాహిత్యం.. మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు.. 2011లో బెంగళూరులోని మంగళూరులో జరిగిన బాంబు పేలుడు వంటి సంఘటనలు సుమారు 50 వరకు చేయగ లిగే.. బాంబుల తయారీ పదార్థాలను ఇక్కడ స్వాధీనం చేసుకున్నారు. ఒక సూటు కేసు బాంబు, మరో బకెట్ బాంబును తయారు చేసినట్లు సమాచారం. ఈ బాంబు ఒక్కొక్కటి సుమారు 150 మీటర్ల విస్తీర్ణంలో విధ్వంసం సృష్టిస్తుందని పోలీసులు పేర్కొన్నారు. వీటిని దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలలో పేల్చేందుకు ఉగ్రవాదులు ప్రణాళిక సిద్ధం చేశారని... అందుకే ఉగ్రవాదులు బాంబులు తయారు చేసి సిద్ధంగా ఉంచారని పోలీసులు పేర్కొంటున్నారు. ఇటీవలే కశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదుల మారణకాండ మర్చిపోక ముందే.. ఈ ఉగ్రదాడి జరిగిఉంటే.. దేశ వ్యాప్తంగా కలకలం రేగేది. అయితే అన్నమయ్య జిల్లా పోలీసులు మూడు దశాబ్దాలుగా తప్పించుకు తిరుగుతున్న ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకోవడంతో పాటు.. దేశ వ్యాప్తంగా పలుచోట్ల ఉగ్రవాదులు విధ్వంసానికి పాల్పడకుండా భగ్నం చేయగలిగారు. దీనిపై జిల్లా పోలీసులను ప్రజలు ప్రశంసిస్తున్నారు. రాబోయే రోజుల్లో పోలీసుల విచారణలో ఉగ్రవాదుల అరెస్టు.. బాంబులు, బాంబుల తయారీ పదార్థాల స్వాధీనం కేసులో.. ఎన్ని పరిణామాలు జరుగుతాయో ? ఎవరెవరి ప్రమేయం ఉందో ? పోలీసుల విచారణలో వెలుగు చూడాల్సిందే.



ఇసుక బస్తాల మధ్య ఉంచిన బాంబులను డిస్పోజ్ చేస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో బోనాల పండుగ

సంబేపల్లె, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటకట్ల శివసాయి ఆలయంలో శుక్రవారం బోనాల పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాల నడుమ అమ్మవారి నామస్మరణలతో కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి భక్తి పూర్వకంగా మొట్టమొదటి బోనాల పండుగ జరుపుకొన్నారు. వెంకటశివసాయి దేవస్థానం ప్రాంగణం భక్త జన సందోహంతో కళకళలాడింది. ఆలయంలో తొలిసారి బోనాల పండుగ ఎంతో ఘనంగా మహిళలు జరుపుకొన్నారు. రాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకం నిర్వహించగా, అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సంప్రదాయ బోనం సమర్పించి అమ్మవారి ఆశీస్సుల కోసం పూజలు చేశారు. పాలపొంగళ్ల అమ్మవారికి బోనాలను సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



బోనం కూడు వండుతున్న మహిళలు

గృహోపకరణాలు దగ్ధం

● విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణం

పెద్దతిప్పసముద్రం జూలై 4 (ఆంధ్ర జ్యోతి): ఓ ఇంట్లో ఎవరూ లేని సమ యంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కార ణంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మల్లెల గ్రామంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ సొంత సనుల నిమిత్తం మరో ఊరికి వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో ఇంట్లోని గృహోపకర ణాలు పూర్తిగా కాలిపోయాయి. ఇంటి నుంచి దట్టమైన పొగ వస్తుండడంతో గమనించిన స్థానికులు అప్రమత్త మయ్యారు. వెంటనే విద్యుత్ సరఫరా కట్ చేసి మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయన్నారు. సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అజ్మత్ పేర్కొన్నారు.

కుమారుడి చేతిలో గాయపడిన తండ్రి



రక్తగాయాలతో వెంకటరమణ

మదనపల్లె అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భార్యపై కోపంతో కొడవలితో దాడి చేయబోతుండగా అడ్డొచ్చిన తండ్రికి ఆ వేటు పడి గాయపడిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. ఇందిరా నగర్‌లో కాపురం ఉంటున్న భాస్కర్‌నాయుడు భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని రెండేళ్లుగా బసినికొండలోని అమ్మగారి ఇంటి వద్ద ఉండేది. కాగా భర్త కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి గురువారం తన ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య శుక్రవారం ఉదయం భర్తను చూసేందుకు రావడంతో భర్త ఆగ్రహంతో ఊగిపోయాడు. రెండేళ్లుగా అవసరం లేని తాను ఇప్పుడు కావాల్సి వచ్చాడా అంటూ ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో కోపంతో కొడవలితో దాడి చేయబోయాడు. ఈ నేపథ్యంలో అడ్డొచ్చిన భాస్కర్‌నాయుడు తండ్రి వెంకటరమణ (60) తలపై కొడవలి వేటు పడడంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాయపడిన వ్యక్తిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విచారించి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సమస్యలతో విసుగు చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బి.కొత్తకోట మండలం, బడికాయలపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు మల్లప్ప(45) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. అయితే కొన్ని సమస్యలతో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయిన ఆయనను కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోళ్లబైలులో ఆలయ స్థలం పరిశీలన



ఆలయ స్థలం పరిశీలిస్తున్న ఎండోమెంట్ జిల్లా అధికారి విశ్వనాథ్

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి) మండలంలోని కోళ్లబైలు పంచాయతీలో, ఇందిరమ్మ కాలనీలో గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని, ఆలయ స్థలాన్ని శుక్రవారం దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ పరిశీలించారు. కలెక్టరేట్ ఆదేశాల మేరకు కాలనీలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆంజనేయస్వామి ఆలయ స్థలం పరిశీలించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థలం సర్వే నిర్వహించి ఆలయం ఏర్పాటుకు సహకరించాలని దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్‌ను గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో ఈవో రమణ, కాలనీ వాసులు శ్రీనివాసులరెడ్డి, రవీంద్రరెడ్డి, మధుసూదన, రామ్మోహన, ఏవీ లక్ష్మీనారాయణ, మంజునాథ, శ్రీరాములు, విజయ్‌కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24



నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24- వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోనెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

» మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా

» అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్

» మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి

» డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

» ఏటీఎం కార్డుల్లా రూపకల్పన

» క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం

» పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు

» నేతల ఫొటోలు లేకుండా ముద్రణ

» ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు

» సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు

» వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫొటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

పసుపు సాగుపై ఆసక్తి

- రెట్టింపు సాగవుతుందని అంచనా
- గిట్టుబాటు ధరలే కారణమంటున్న రైతులు

దువ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు కుదేలవుతున్నారు. ధరల పతనం, తెగుళ్లు వెంటాడుతుండడం, పెట్టుబడులు తడిసి మోపెడు అవుతున్న నేపథ్యంలో పంటలసాగుపై



నిలువ ఉంచిన విత్తనాన్ని సాగుకు తరలిస్తున్న రైతులు

అన్నదాతకు ఆసక్తి సన్నగిల్లుతోంది. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు అందే పంటలపై మొగ్గుచూపుతున్నారు. తదనుగుణంగా ఆరుతడి పంటల సాగుపై మక్కువ కనపరుస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా పసుపు పంట సాగు చేసిన రైతులు మంచి ఫలితాలు సాధించారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ పంట సాగుకు ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మైదుకూరు ప్రాంతం పసుపుసాగుకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలోని దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు పరిసరాల్లో కేసీ ఆయకట్టు పొలాల్లో ప్రతి ఏటా ఈ పంట సాగు చేపడుతారు. ప్రతియేటలాగే ఈసారి కూడా ఈ పంట సాగును ముమ్మరం చేశారు. పొలాల్లో విత్తనం వేయడానికి ఇదే అదును కావడంతో ఆ పనుల్లో రైతులు మునిగిపోయారు. కిందటి ఏడాది దువ్వూరులో 502 ఎకరాల్లో, ఖాజీపేట 413, మైదుకూరులో 798, చాపాడులో 315, రాజుపాళెంలో 50 ఎకరాలు రైతులు పసుపు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. మొత్తంగా రెండు వేల ఎకరాలకుపైగా ఈ పంట పెట్టిన రైతాంగం ధరలు ఆశాజనకంగా ఉండడంతో మంచి లాభాలు గడించారు.

రెట్టింపు సాగవుతుందని అంచనా..

మార్కెట్‌లో క్వింటాలు వట్టి పసుపు 10 వేల నుంచి 12,500 ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో నిరుడుతో పోల్చుకుంటే మైదుకూరు డివిజన్‌లో కొంచెం అటు ఇటుగా రెట్టింపు సాగవుతుందని అంచనా వేస్తున్నారు. పొలంలో విత్తనం వేసే పనులు ఇప్పుడిప్పుడే ఊ



పొలంలో పసుపు విత్తనం వేస్తున్న కూలీలు

పందుకున్నాయి. ఎకరాలో నాలుగు పుట్లకుపైగా విత్తనం వేస్తున్నారు. పుట్టి పసుపు ఆరు నుంచి రూ.7 వేలు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడులు తడిసి మోపెడు అవుతున్నా రైతులు సాగుకు వెనుకంజ వేయడంలేదు. మైదుకూరు ప్రాంత విత్తన కొమ్ముకు మంచి డిమాండ్ ఉంది. అక్కడి నుంచి కొనుగోలు చేసి మిగతా మండలాల్లో ఈ పంట వేస్తున్నారు. చాలా మంది రైతులు వారి పొలంలో పండిన పసుపును విత్తనంగా నిలువ ఉంచి ఇప్పుడు పొలంలో విత్తుతున్నారు. విత్తనం వేసే ముందు పొలాలకు అనుకూలమైన చెక్క, రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. సాలు, బోదె పద్ధతుల్లో విత్తుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో కేసీ కాలువకు ముందుగానే సాగునీరు అందుతుందని రైతులు భావిస్తున్నారు.

బాలలహక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

కడప కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశహాల్‌లో బాలల హక్కుల పరిరక్షణ అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, కమిషన్ విధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పిల్లల పట్ల సున్నితత్వంతో మెలగాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగు పరచాలన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల్లో పిల్లలను సొంత బిడ్డల్లాగా వారి బాగోగులు చూడాలని సూచించారు. పిల్లలు తమకు ఎదరయ్యే సమస్యలు, ఇబ్బందులపై ఎవరికీ చెప్పుకోలేరని.. అందుకోసం రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు. పిల్లల సమస్యల పరిష్కారానికి 1098 టోల్ ఫ్రీ నెంబరుకి ఫోన్ చేస్తే పరి ష్కరిస్తామని కమిషన్ సభ్యురాలు తెలియజేశారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డీడీ అంజల, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసరు హిదాయుతుల్లా, ఉమెన్ పోలీసు స్టేషన్ డీఎస్పీ బాలస్వామి, బాలల సంరక్షణ అధికారి సుభాష్, సంక్షేమ హాస్టళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో జీవితఖైదు



జీవిత ఖైదు శిక్ష పడిన మల్లికార్జున

కడప క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కడప తాలుకా పీఎస్ పరిధిలో ఆరేళ్లక్రితం అనుమానంతో తన భార్యను వేధింపులకు గురి చేసి గొంతు నులిమి హత్య చేసిన కేసులో నిందితుడు జరిపిటి మల్లికార్జున (41)కు జీవితఖైదు, రూ.1.60 లక్షలు జరిమానా విధిస్తూ కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేశ్ కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా.. కడప ఏఎస్ ఆర్‌నగర్‌లో నివశించే మల్లికార్జున చిత్తూరు జిల్లాకు చెందిన తమ్మిశెట్టి గంగాదేవితో 2012లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మల్లికార్జున పండ్లను విక్రయిస్తూ కుటుం బాన్ని పోషించేవాడు. భార్య గంగాదేవిపై అనుమానం పెంచుకుని హత్య చేస్తానని బెదిరించేవాడు. ఈ క్రమంలో 2019లో తన భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు అప్పటి తాలుకా సీఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కాగా విచారణలో సాక్ష్యాలతో సహా నేరం నిరూపణ కావడంతో మల్లికార్జునకు జీవిత ఖైదు, రూ.1.60 లక్షలు జరిమానా విధిస్తూ కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారు. సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచి సాక్ష్యాధారాలతో నేరస్తుడికి శిక్షపడేలా కృషి చేసిన కడప తాలుకా సీఐ రెడ్డప్ప, కోర్టు కానిస్టేబుల్ రఘురాముడు, కోర్టుమానిటరింగ్ సెల్ హెడ్‌కానిస్టేబుల్ రాజులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

యువతి హత్య కేసులో ముగ్గురికి పదేళ్లు జైలు



జైలుశిక్ష పడిన ముద్దాయిలు వీరే...

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి హత్య కేసులో ముగ్గురు నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ కడప నాలుగవ ఏడీజే కోర్టు జడ్జి జి.దీనా బాబు శుక్రవారం తీర్పునిచ్చారు. పోరుమామిళ్ల పీఎస్ పరిధిలోని రామాయపల్లె శ్మశానం వద్ద 2019లో ఓ మతిస్థిమితం లేని యువతిని గొంతు నులిమి హత్యచేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి సీఐ నిందితులను అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు. విచారణలో పోరుమామిళ్ల బెస్తవీధికి చెందిన షేక్ జిలానీబాషా, ముస్లిం కోటవీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా, కట్టకిందపల్లెకు చెందిన కారు నాగేంద్ర ప్రసాద్‌లు యువతిని గొంతునులిమి హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో శుక్రవారం ఆ ముగ్గురికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. కేసులో శిక్ష పడేలా అప్పటి సీఐ మోహ న్‌రెడ్డి, సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి శిక్షప డేలా కృషి చేసిన పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి, కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్యలను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

కానిస్టేబుల్ అని నమ్మించి... పెళ్లి చేసుకున్న వ్యక్తిపై ఫిర్యాదు



కానిస్టేబుల్ దుస్తుల్లో భానుప్రకాశ్ (ఫైల్)



పెళ్లి సమయంలో. భానుప్రకాశ్

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తాను కానిస్టేబుల్ అని నమ్మించి ఓ యువతిని వివాహం చేసుకొని మోసం చేయడంతో ఆ వ్యక్తిపై యువతి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... సత్యసాయి జిల్లా తనకల్లు మండలం తుమ్మలవారిపల్లె ప్రాంతానికి చెందిన భానుప్రకాశ్ అనే వ్యక్తి తాను కానిస్టేబుల్ అని పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లెకు సమీపంలో నివశిస్తున్న ఓ యువతిని నమ్మించి 2024 అక్టోబరులో వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్నం కింద రూ.3లక్షల నగదు, 15 తులాల బంగారు నగలు ఇచ్చినట్లు యువతి బంధువులు తెలిపారు. వివాహం అయిన తరువాత తాను ఏఆర్ కానిస్టేబుల్ అని చెప్పి హైదరాబాదులో సంసారం పెట్టి నమ్మించాడు. 8 నెలలుగా డ్యూటీకి వెళ్లకపోవడంతో అనుమానం వచ్చిన ఆ యువతి నిలదీయగా.. తాను కానిస్టేబుల్ కాదని ఏం చేస్తారో చేసుకోండని బెదిరించాడు. అదనంగా డబ్బులు కావాలని వేధించేవాడు. దీంతో ఆ యువతిని అతని నుంచి తప్పించుకుని కమ్మవానిరిపల్లె సమీపంలో ఉన్న తన స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో వారు శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ కొండారెడ్డిని వివరణ కోరగా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి

కడప కలెక్టరేట్, జూలై4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు సంబంధించిన గోడపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం, వాతావరణ అంశాల ఆధారంగా సంభవించే పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించడం పంటల బీమా పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎంపిక చేసిన పంటల సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకానికి అర్హులన్నారు. బీమా చేసిన మొత్తానికి 2 శాతం వాణిజ్య, ఉద్యాన పంటలకు 5శాతం, వాస్తవంగా నోటిఫై చేసిన ప్రీమియం శాతం ఇంకా తగ్గిన సందర్భంలో ఆ మొత్తాన్ని చెల్లిస్తే సరిపోతుందన్నారు. వాస్తవ ప్రీమియంలో రైతు చెల్లించగా మొత్తాన్ని బీమా కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయన్నారు. వాతావరణ ఆధారిత



పంటల బీమా గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

పంటల విషయంలో వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి వేగం ఆర్ధత వంటి వాతావరణ అంశాల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేసి ఆయా మండలాల పరిధిలో బీమా లెక్కించి చెల్లించడం జరుగుతుందన్నారు. ఎలాంటి దళారులు మధ్యవర్తులను నమ్మి పోవద్దన్నారు. పంట వేసిన ధ్రువ పత్రం జారీ నిమిత్తం కూడా ఎటువంటి మొత్తాన్ని రైతు సేవా కేంద్రంలో చెల్లించాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు చంద్ర నాయక్, రవి చంద్రబాబు, ఎల్డీఎం జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లల్లో ముమ్మరంగా తనిఖీలు



కడప రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ

కడప క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా ఈగల్‌టీం ఐజీ ఆకే రవిక్రిష్ణ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఎస్పీ ఆదేశాలతో రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఎర్రగుంట్ల-కడప మార్గంలో ముంబై నుంచి చెన్నై ఎగ్మోర్ వెళుతున్న రైల్లో కడప మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్, రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ, పోలీసు, డాగ్‌స్క్వాడ్ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కోసం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నెం.1972 ఏర్పాటు చేశారని, ఈ నెంబరుకు సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్ నాథరెడ్డి, కడప రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, స్పెషల్‌పార్టీ ఈగల్‌టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజాన్ని నిర్మిద్దాం..

- పీ-4 పథకం అమలుపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం



కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని ఆంధ్రప్రదేశ్ సచివాయం నుంచి పీ-4 పథకం అమలుపై మార్గదర్శులు, బంగారు కుటుంబాలు అనే అంశంపై జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సమీక్షలో కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర సచివా లయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సరైన సమయంలో సాయం నిరంతర మార్గనిర్దేశనం అన్నారు. పేదరి కంపై యుద్ధం చేసి చరిత్ర సృష్టించాలన్నారు. బంగారు కుటుంబాలకు సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోత ఉండదని సీఎం స్పష్టం చేశారు. పీ-4 అమలులో బాపట్ల జిల్లా టాప్‌లో ఉందన్నారు. పేదరికం లేని సమా జాన్ని స్థాపించడమే పీ-4 పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాష్ట్రంలో 2029 నాటికి పేదరికాన్ని రూపుమాపాలనే లక్ష్యంతో కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పని చేయాలన్నారు. పీ-4 విధానంలో పేదలకు సాయం చేస్తూనే ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆర్థికంగా స్థిరపడిన 10 శాతం మందితో అట్టడుగు పేద రికంలో ఉన్న 20 శాతం మందితో అనుసంధానం చేసే విధానమే పీ-4 పథకమన్నారు. పేదరికం లేని సమాజానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలు తదితరాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, అగ్రికల్చర్ జేడీ చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

- ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన



డాక్టర్‌తో మాట్లాడుతున్న మృతుడి బంధువులు

పులివెందుల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని గోటూరు సమీపంలో జరిగిన ద్విచక్రవాహనం ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే.... తొండూరు మండలం సైదాపురానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి (53) గంగరాజు మోటర్‌బైకులో వస్తుండగా ఉన్నట్లుండి రోడ్డుపైకి గేదె వచ్చింది. దీన్ని తప్పించబోయి అదుపుతప్పి మోటర్ బైకు కిందపడింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణరెడ్డి తలకు గాయాలయ్యాయి. గంగరాజుకు స్వల్ప గాయాలు కావడంతో వీరిని పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లక్ష్మీనారాయణరెడ్డికి తలకు గాయం కావడంతో చికిత్స కోసం ఆసుపత్రిలో జాయిన్ చేసుకున్నారు. చికిత్స పొందుతుండగా అర్ధరాత్రి లక్ష్మీనారాయణరెడ్డి మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యం చేయడం చేతకాకపోతే మరో ఆసుపత్రికి తీసుకెళ్లేవారమని మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపుచేశారు. డాక్టర్ కుటుంబ సభ్యులతో మంతనాలు జరపడంతో సమస్య సద్దుమణిగింది. దీనిపై తొండూరు ఎస్ఐ ఘనమద్దిలేటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధం

లింగాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామసముద్రం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తికి సంబంధించిన గడ్డివామి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.30వేలు నష్టం వాటిల్లింది. ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

వెనుకంజలో చిత్తూరు, అనంతపురం జట్లు



మన్విత్‌రెడ్డి, (నెల్లూరు), ఎస్ఎస్ హుస్సేన్ (నెల్లూరు), వీరారెడ్డి (అనంతపురం)

కడప స్పోర్ట్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే (మూడు రోజుల) క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం వేర్వేరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు నెల్లూరు జట్టు కంటే 324 పరుగుల వెనుకంజలో నిలిచింది. అదే తరహాలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు 74 పరుగుల తేడాతో వెనుకబడి వుంది.

ఏసీఏ మైదానంలో..: నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మన్విత్ రెడ్డి 140 పరుగులు చేయగా ఎస్ఎస్ హుస్సేన్ 63 పరుగులు చేశా రు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 14 పరు గులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు మరో 324 పరుగుల వెను కంజలో ఎదురీదుతోంది.

కేఓఆర్ఎం మైదానంలో..: కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి 59.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 213 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 68 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 139 పరుగులు చేసింది. ఇందులో వీరారెడ్డి 62 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో అనంతపురం జట్టు మరో 74 పరుగుల వెనుకంజలో వుంది.

భువనేశ్వరి దేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రైల్వేకోడూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న భుజంగేశ్వరస్వామి ఆలయంలో వెలసిన భువనేశ్వరి అమ్మవారికి శుక్రవారం భక్తులు రాహుకాల పూజలు చేశారు. ఆలయ అర్చకులు యోగీశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అ మ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రంగనాయక స్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో రంగనాయక స్వామివారు

చిట్వేలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి మండలం నగిరిపాడు శ్రీ రంగనాయక ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజల నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఈ ఆలయంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమాలు, పూ జా కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఒంటిమిట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి వీరేంద్రసింగ్ అన్నారు. శుక్రవారం కొత్త మాధవరం ఉన్నత పాఠశాలలో డెంగ్యూ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్‌లు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనరసమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబేద్కర్, సీహెచ్‌వో వనిత, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో అన్నదానం

నందలూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో ప్రసిద్ధిగాంచిన సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు యద్దల సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11న స్వామివారి కల్యాణం సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుందన్నారు. 12న రథోత్సవం నాడు రీజెన్సీ సంస్థల అధినేత జీఎన్‌నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన అన్ని రోజుల్లో ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

బ్యాంకు పథకాల పట్ల అవగాహన అవసరం

ఓబులవారిపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు పథకాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని విడ్స్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన, పీఎంఎస్‌బీవై, జేజేబీవై, అటల్ పెన్షన్‌యోజన, జన్‌ధన్ యోజన అకౌంట్లు, వాటికి 10 సంవత్సరాలు గడిచిన అకౌంట్లకు ఈకేవైసీ చేయించాలన్నారు. ఇన్సూరెన్స్ వల్ల అండగా ఉంటుందన్నారు.

'పోలీసుల కృషి అభినందనీయం'

రాయచోటిటౌన్, జూలై4(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో ఉగ్రవాద మూకలను అరెస్టు చేసిన తమిళనాడు, ఏపీ పోలీసు యంత్రానికి ప్రత్యేక అభినందలు తెలిజేస్తున్నామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పాలిగిరి శ్రీనివాసరాజు, అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద గజపతిరాజులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. అంకితభావంతో పనిచేసిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఉగ్రవాద మూకల ఆటలు కట్టించడానికి పోలీసు యంత్రాంగం కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన కోరారు.

మాచుపల్లె వంతెన నిర్మాణం జరిగేనా ?



బ్రిడ్జి నిర్మాణం కోసం అప్పటి సీఎం నందమూరి తారకరామారావు శిలాఫలకం ప్రారంభించిన దృశ్యం

సిద్దవటం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలం మాచుపల్లె ఖాదర్‌బంగ్లా మార్గంలోని కడప పోరుమామిళ్ల రహదారి పెన్నానదిపై అలుగు బ్రిడ్జి నిర్మాణం జరిగేనా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. బ్రిడ్జి లేకపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్రిడ్జి కోసం 1988 జూలై 6న అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శంకుస్థాపన చేశారు. 1990లో కోటి రూపాయల వ్యయంతో పెన్నాపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. మాచుపల్లె వైపున పెన్నానదిపై కొంతవరకు పునాదులు కూడా తవ్వారు. పనులు ప్రాథమికదశలో ఉండగా అకస్మాత్తుగా పెన్నానదికి వరద వచ్చి నిర్మాణ సామగ్రి కొట్టుకుపోయింది. అనంతరం పనులు ముందుకు సాగగా ఆ పనులు రద్దు అయ్యాయి. 2009 జనవరి 24న సిద్దవటం సమీపంలో పెన్నానదిపై నిర్మించిన వంతెన ప్రారంభోత్సవానికి విచ్చేసిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.16 కోట్లతో వంతెన నిర్మిస్తామని నిండు బహిరంగ సభలో ప్రజలకు హామీ ఇచ్చారు. అప్పటి నుంచి నేటివరకు నిధులు మంజూరు కాలేదు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు నారా లోకేశ్ తలపెట్టిన యువగళం పాదయాత్రలో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ మాచుపల్లె గ్రామంలో 2023 జూన్ 9న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మాచుపల్లె పెన్నానది పై వంతెన నిర్మాణం చేపడాతమని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి యేడాది అవుతున్నా ఇంతవరకు హామీ అమలు కాలేదని మండల ప్రజలు నిరాశతో ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లావాసిగా ఉన్నా బ్రిడ్జి నిర్మాణం కోసం ఎటువంటి హామీ ఇవ్వలేదని, బ్రిడ్జి నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలని పలువురు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: మంత్రి మండిపల్లి



పాఠశాల ప్రహరీ ప్రారంభోత్సవంలో విద్యార్థినులతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, జూలై4(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు.శుక్రవారం కేశాపురం, దేవళంపేట గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనుల ప్రజలకు వివరించారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

మండలంలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెకు వరకు రూ.60 లక్షలతో బీటీ రోడ్డు పునరుద్ధరణకు భూమి పూజ చేశారు. జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో రూ.43 లక్షలతో నిర్మించిన ప్రహరీ, ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైస్కూల్‌లో సమస్యలను త్వరలోనే పరిష్కరించి పిల్లలకు కావాల్సిన పరికరాలను తన సొంత నిధులతో తెప్పిస్తానని హామీ ఇచ్చారు. బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ నిర్వహించి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత, మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి భూమిపూజలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే ప్రజలందరికీ న్యాయం

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



యూవీ అగ్రహారంలో తొలిఅడుగు కార్యక్రమంలో రూపానందరెడ్డి, టీడీపీ నాయకులు

పుల్లంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ప్రజలందరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లె, కొట్టాలుపల్లె, యూవీ అగ్రహారం, దండ్లోపల్లె, కోనయ్యగారిపల్లె, కొత్తపేట, వేల్పులవారిపల్లె గ్రామాల్లో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, పోలూరు కృష్ణమనాయుడు, లింగుట్ల వెంకటరమణనాయుడు, కుప్పాల రామకృష్ణయ్య, చిన్నం శివయ్య, సంజయ్‌గాంధీ, మహిళా నాయకురాలు సౌభాగ్యవతి, మారోతి మల్లి తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, సబ్‌కలెక్టర్ నిదియాదేవి

రాజంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ సభా భవనంలో సబ్‌కలెక్టర్ నిదియాదేవి అధ్యక్షతన జరిగిన రాజంపేట నియోజకవర్గ 2047 లక్ష్యానికి చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నియోజకవర్గంలోని తహసిల్దారులు, ఎంపీడీవోలతో జరిగిన సమీక్ష సమావేశానికి చమర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తహశిల్దారులు ఎంపీడీవోలు, అన్నిశాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలన్నారు.

సబ్‌కలెక్టర్ నిదియాదేవి మాట్లాడుతూ పేదరికంలేని సమాజం అన్న నినాదంతో పీ-4 విధానంతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 10 సూత్రాలతో చేపట్టిన విజన్ 2047 లక్ష్యాలతో ముందుకు సాగడానికి అందరూ కలిసికట్టిగా కృషి చేయాలన్నారు. దీనివల్ల అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు.

కట్టావారిపల్లెలో...

రాజంపేట మండలం కట్టావారిపల్లెలో చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు పోరా సుబ్బానాయుడు, గన్నే సుబ్బనరసయ్యనాయుడు, కమ్మ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణచౌదరి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు బాపనయ్యనాయుడు, వెంకటేశ్వర్లునాయుడు తదితరులు పాల్గొన్నారు. మామిడి

రైతుకు అండగా కూటమి ప్రభుత్వం

మామిడి రైతుకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాజంపేటలో విలేకరులతో మాట్లాడుతూ మామిడి రైతులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిచెరువు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రో డ్డు ప్రమాదంలో అబ్బు సిద్దిఖ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వేంపల్లెకు చెందిన ఇతను వేంపల్లె నుంచి రాయచోటికి వెళుతుండగా దొరిచెరువు సమీపంలో ముందుగా వెళుతున్న ట్రాక్టర్‌కు ఢీకొనడంతో గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా లక్కిరెడ్డిపల్లె ప్రభు త్వాస్పత్రికి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

ప్రకృతి వ్యవసాయ విధానంలో డ్రాగన్ ఫ్రూట్

సుండుపల్లె, జూలై4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేయడం వలన ఖర్చులు తగ్గి అధిక దిగుబడి సాధించవచ్చునని డీపీయం వెంకటమోహన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని జీ. రెడ్డివారిపల్లెలో రైతు బాబురెడ్డి సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సహాయకులు పరిశీలించారు. డ్రాగన్ ఫ్రూట్ తోటకు ద్రవజీవామృతాన్ని, ఘనజీవామృతాన్ని అందించడంతో ఖర్చులు తగ్గి లాభం వస్తుందన్నారు.



లంకమల అభయారణ్యంలో పురాతన శాసనాలు



సిద్దవటం, జూలై 4(ఆంధ్రజ్యోతి):సిద్దవటం మండలం లంకమల అభయారణ్యంలో వెలసిన నిత్యపూజేశ్వరకోన పైభాగం అక్కదేవతల గుడి సమీపాన 8 కిలోమీటర్ల ఎత్తైన కొండ శిఖరాన పురాతన శాసనాలు ఉన్నట్లు తెలుస్తోంది. భారతదేశ పురావస్తు శాఖ 6వ శతాబ్దపు నాటి సంస్కృత భాషలో షెల్ అక్షరాల్లో శాసనాలు ఆంధ్రప్రదేశ్‌లోని లంకమల అట వీ ప్రాంతంలో బయటపడ్డాయి. ఈ శాసనాలు ఆరో శతా బ్దం నాటి సంస్కృత భాషలో, షెల్ అక్షరాలతో రాయబడ్డాయి.ఈ శాసనాలు భారతదేశంలోని ఉత్తర ప్రాం తాలు, దక్కన్‌లో మాత్రమే కనుగొనబడ్డాయి. ఇది మొదటిసారిగా లంకమల అటవీ ప్రాంతమైన నిత్యపూజేశ్వరకోనలో కనుగొనబడిందని భారతదేశపు పురావస్తు శాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నంరెడ్డి తెలిపారు. లంకమల అభయారణ్యంలో అందాలు వెదజల్లే శిలా శాసనాలు బయటపడే అవకాశం ఉందన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

నందలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని మండల అధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో సర్వసభ్య సమావేశం ఎంపీడీవో రాధాకృష్ణన్ అధ్యక్షతన జరిగింది. డిప్యూటీ తహసీల్దారు మోహన్, వైస్ ఎంపీపీలు నాయనపల్లి అనుదీప్, తుమ్మల భావన, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రాజంపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు మాలేపాటి రామకృష్ణమనాయుడు ఆర్థిక సహకారంతో పేదలకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, ఆర్.వెంకటసుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభించిన వెంకటమోహన్

చిన్నమండెం, జూలై4(ఆంధ్రజ్యోతి):ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ అన్నారు. మండలంలోని చాకిబండ యూనిట్ పరిధిలోని మల్లూరు గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల వినియోగం వల్ల కలిగే లాభాలను తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందులు లేని ప్రకృతి వ్యవసాయ విధానంలో పండే కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. వీటిని తినడం వల్ల శరీరానికి రోగనిరోధక శక్తి పెరుగుతుంద న్నారు. మార్కెటింగ్ ఎంటీ పద్మావతి, ఎంటీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే

రైల్వేకోడూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రతి అధికారి కృషిచేయాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అవినీతికి తావులేకుండా చూడాలన్నారు.

విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ఆపాలి: సీఐటీయూ

రాయచోటిటౌన్, జూలై4(ఆంధ్రజ్యోతి): కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగ ప్రైవేటీరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ కార్మికులతో సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పని భారం తగ్గించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అనంతరం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిస్కమ్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2లను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఈ నెల 9న జరిగే అఖిల భారత సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విద్యుత్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డివిజన్ నాయకులు గజేంద్రనాయుడు, మహబూబ్‌బాషా, కార్మికులు తిమ్మారెడ్డి, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్లను వెంటనే రద్దు చేయాలి: ఏఐటీయూసీ

రైల్వేకోడూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకమైన ఆ నాలుగు లేబర్ కోడ్ల ను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ తెలిపారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కోడ్ల వల్ల కార్మికులకు పలు కష్టాలు ఏర్పడ్డాయని, వీటిని రద్దు చేయాలని వామపక్షాలు ఈ నెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను చేపట్టాయన్నారు. ఈ సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ రత్నమ్మ, నాయకురాళ్లు మౌనిక, చెంగమ్మ, విజయలక్ష్మి, యశోద తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం

రాయచోటిటౌన్, జూలై4(ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమని సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు అబ్బవరం రామాంజులు, సాంబశివలు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ రమణ, జిల్లా క్యాదర్శి భాగ్యలక్ష్మి, మున్సిపల్ యూనియన్ టౌన్ కమిటీ అధ్యక్షులు చెన్నయ్య, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి'



మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జూలై4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని ఉమ్మడి కడప జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశం లో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేయని సూపర్ సిక్స్ హామీలను ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రెడ్డెప్పగారి రమేశ్‌కుమార్‌రెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్య సంఘంపై ఆరోపణలు తగవు'

రైల్వేకోడూరు రూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘంపై ఆరోపణలు తగవని అధ్యక్షుడు గునిశెట్టి రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య సభా మందిరంలో సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నెలలో జరిగి సమావేశంలో జమాఖర్చులు తెలియజేస్తామని, నోటీస్ బోర్డుపై కూడా వాటిని చూపుతామన్నారు. గౌరవ అధ్యక్షుడు కొప్పరపు నరసింహులు, సుందర్‌రాజ, మాజీ అధ్యక్షుడు పార్థసారథి, ప్రధాన కార్యదర్శి చలపాటి హరినాథ్, కోశాధికారి కె.వి.వి. సత్యనారాయణ గుప్తా, కలపాటి శ్రీధర్, దేవస్థాన అధ్యక్షుడు కామిశెట్టి బాలాజీ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి : కస్తూరి



సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి

రైల్వేకోడూరు రూరల్, జూలై4(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకుడు కృష్ణ చైతన్య, కోడూరు పరిశీలకుడు మిరియాల నాగజ్యోతి, చిట్వేలి పరిశీలకుడు వెంకటరమణ, పెనగలూరు పరిశీలకుడు శ్రీనాథ్‌రెడ్డిలతో కలిసి సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. నిరంతరం ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లి మాజీ జెడ్పీటీసీ నాయుడోరి రమణ, కట్టా లోకేష్, రాజ మరియు కార్యకర్తలు తదితరులు పాలొన్నారు.

రేషన్ షాపును తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు

లక్కిరెడ్డిపల్లె, జూలై4(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెలోని 11వ రేషన్ షాపును శుక్రవారం విజిలెన్స్ అధికారులు శివన్న తనిఖీ చేశారు. 159 కేజీలు అధికంగా ఉన్నాయని, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక తహసీల్దార్‌కు అప్పజెప్పి రేషన్ షాపును సీజ్ చేసినట్లు తహసీల్దార్ క్రాంతికుమార్ తెలిపారు. ఈ మేరకు పరిశీలించి నివేదికలు పంపుతామని విజిలెన్స్ అధికారులు తెలిపినట్లు ఆయన వివరించారు.

విద్యార్థినులను పరామర్శించిన డీఎంహెచ్‌వో


విద్యార్థులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య

చిన్నమండెం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బోనమల ప్రభుత్వ పాఠశాలలో ఒక తాగుబోతు విద్యార్థులపై చేసిన దాడిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం ఆరాతీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బోనమల ప్రాథమిక పాఠశాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య సంఘటన స్థలానికి వెళ్లి బాలికలను, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం బలికలపై దాడి జరిగిన వెంటనే చిన్నమండెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు వెళ్లి చికిత్స చేశారన్నారు. మెరుగైన వైద్యం అందించారన్నారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి బాలికలను పర్యవేక్షించాలని ఆదేశించామన్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పాఠశాలలోకి వెళ్లి విద్యార్థులపై దాడి చేస్తుంటే ఉపాధ్యాయులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

డైలేరియా ప్రాణాంతక వ్యాధి

● రాయచోటి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య

సుండుపల్లె, జూలై4(ఆంధ్రజ్యోతి): డైలేరియా ప్రాణాంతక వ్యాధి అని రాయచోటి డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య తెలిపారు. శుక్రవారం సుండుపల్లె మండలంలోని ఈడిగపల్లెలో సంకరజాతి పాడి పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఉచితంగా విడుదల చేసిన ఖరీదైన యాంటీ ప్రొటోజోల్ టీకాను 25 పాడి పశువులకు వేశామన్నారు. పాల ఉత్పత్తి కోసం రైతులు వేలాది రూపాయలు వెచ్చించి సంకరజాతి పాలిచ్చే పశువులను కొనుగోలు చేసి ఉంటారని, పిడుదుల ద్వారా వ్యాపించే డైలేరియా ప్రాణాంతక వ్యాధి నుంచి కాపాడేందుకు ఈ టీకాను తప్పనిసరిగా వేయించాలన్నారు. జ్వరం, రక్తహీనత, వ్యాధినిరోధక శక్తి తగ్గడం, పాల దిగుబడి తగ్గడం, పశువులు నీరసించిపోవడం, బూడిదరంగు మూత్రంతో పాటు మరికొన్ని లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ లక్షణాలు కల్పిస్తే వెంటనే పశుసంవర్ధక శాఖ వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ విజయ్‌కుమార్, సహాయ సంచాలకులు డాక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


పాడి పశువులకు యాంటీ ప్రొటోజోల్ టీకాలు వేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మాలకొండయ్య

ఒక అరెస్టు.. ఎన్నో భయాలు..

మరెన్నో సందేహాలు

● భగ్నమే చేయకుంటే.. ఏం జరిగేదో?
● ఊరంతా ఉగ్రవాదుల చర్చే

(మొదటిపేజి తరువాయి)

తమనెక్కడ విచారణకు పిలుస్తారో? అని చాలా మంది హడలిపోతున్నారు. అదే సమయంలో చాలా మందికి ఉగ్రవాదులతో ఆర్థిక లావాదేవీలు నడిచాయి.. ఇప్పుడు వీళ్లంతా ఆందోళన చెందుతున్నారు.

అందరి మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలు..

చుట్టుపక్కల వాళ్లకు వీళ్లు ఎవరైందీ తెలియకుండా.. ఇన్ని సంవత్సరాలు ఎలా రహస్యంగా ఉంచగలిగారు? నిజంగానే.. స్థానికులు ఎవరికీ వీళ్లు ఎవరైందీ తెలియదా? కొంతమందికైనా తెలుసా.? ఎవరైనా అమాయకులు వీళ్ల ఉచ్చులో చిక్కుకున్నారా? ఇటీవల పట్టణంలో జరిగిన కొన్ని సంఘటనల వెనుక.. ఈ ఉగ్రవాదుల ప్రమేయం ఉందా? వీళ్లతో సన్నిహిత సంబంధాలు కొనసాగించిన.. వ్యక్తుల ప్రమేయం ఉందా? అనే అనుమానాలు ఇప్పుడు అందరి మెదళ్లను తొలుస్తున్నాయి.

భగ్నమే చేయకుంటే.. ఎంత విధ్వంసమో ?

ఉగ్రవాదుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన పోలీసులు.. అబూబక్కర్ సిద్దిఖీ ఇంట్లో పెద్దఎత్తున బాంబులు తయారీ పదార్థాలు, కొంత ఉగ్రవాద సాహిత్యం.. మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు.. 2011లో బెంగళూరులోని మంగళూరులో జరిగిన బాంబు పేలుడు వంటి సంఘటనలు సుమారు 50 వరకు చేయగలిగే.. బాంబుల తయారీ పదార్థాలను ఇక్కడ స్వాధీనం చేసుకున్నారు. ఒక సూటు కేసు బాంబు, మరో బకెట్ బాంబును తయారు చేసినట్లు సమాచారం. ఈ బాంబు ఒక్కొక్కటి సుమారు 150 మీటర్ల విస్తీర్ణంలో విధ్వంసం సృష్టిస్తుందని పోలీసులు పేర్కొన్నారు. వీటిని దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలలో పేల్చేందుకు ఉగ్రవాదులు ప్రణాళిక సిద్ధం చేశారని... అందుకే ఉగ్రవాదులు బాంబులు తయారు చేసి సిద్ధంగా ఉంచారని పోలీసులు పేర్కొంటున్నారు. ఇటీవలే కశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్థాన్ ఉగ్రవాదుల మారణకాండ మర్చిపోకముందే.. ఈ ఉగ్రదాడి జరిగిఉంటే.. దేశవ్యాప్తంగా కలకలం రేగేది. అయితే అన్నమయ్య జిల్లా పోలీసులు మూడు దశాబ్దాలుగా తప్పించుకు తిరుగుతున్న ఉగ్రవాదులను ప్రాణాలతో పట్టుకోవడంతో పాటు.. దేశ వ్యాప్తంగా పలుచోట్ల ఉగ్రవాదులు విధ్వంసానికి పాల్పడకుండా భగ్నం చేయగలిగారు. దీనిపై జిల్లా పోలీసులను ప్రజలు ప్రశంసిస్తున్నారు. రాబోయే రోజుల్లో పోలీసుల విచారణలో ఉగ్రవాదుల అరెస్టు.. బాంబులు, బాంబుల తయారీ పదార్థాల స్వాధీనం కేసులో.. ఎన్ని పరిణామాలు జరుగుతాయో ? ఎవరెవరి ప్రమేయం ఉందో ? పోలీసుల విచారణలో వెలుగు చూడాల్సిందే.


ఇసుక బస్తాల మధ్య ఉంచిన బాంబులను డిస్పోజ్ చేస్తున్న దృశ్యం

కుమారుడి చేతిలో గాయపడిన తండ్రి


రక్తగాయాలతో వెంకటరమణ

మదనపల్లె అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భార్యపై కోపంతో కొడవలితో దాడి చేయబోతుండగా అడ్డొచ్చిన తండ్రికి ఆ వేటు పడి గాయపడిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసుల వివరాల మేరకు.. ఇందిరా నగర్‌లో కాపురం ఉంటున్న భాస్కర్‌నాయుడు భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని రెండేళ్లుగా బసినికొండలోని అమ్మగారి ఇంటి వద్ద ఉండేది. కాగా భర్త కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి గురువారం తన ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య శుక్రవారం ఉదయం భర్తను చూసేందుకు రావడంతో భర్త ఆగ్రహంతో ఊగిపోయాడు. రెండేళ్లుగా అవసరం లేని తాను ఇప్పుడు కావాల్సి వచ్చాడా అంటూ ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో కోపంతో కొడవలితో దాడి చేయబోయాడు. ఈ నేపథ్యంలో అడ్డొచ్చిన భాస్కర్‌నాయుడు తండ్రి వెంకటరమణ (60) తలపై కొడవలి వేటు పడడంతో తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాయపడిన వ్యక్తిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విచారించి టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సమస్యలతో విసుగు చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బి.కొత్తకోట మండలం, బడికాయలపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు మల్లప్ప(45) తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. అయితే కొన్ని సమస్యలతో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయిన ఆయనను కుటుంబ సభ్యులు గమనించి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు బి.కొత్తకోట పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోళ్లబైలులో ఆలయ స్థలం పరిశీలన


ఆలయ స్థలం పరిశీలిస్తున్న ఎండోమెంట్ జిల్లా అధికారి విశ్వనాథ్

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి) మండలంలోని కోళ్లబైలు పంచాయతీలో, ఇందిరమ్మ కాలనీలో గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని, ఆలయ స్థలాన్ని శుక్రవారం దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ పరిశీలించారు. కలెక్టరేట్ ఆదేశాల మేరకు కాలనీలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న ఆంజనేయస్వామి ఆలయ స్థలం పరిశీలించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థలం సర్వే నిర్వహించి ఆలయం ఏర్పాటుకు సహకరించాలని దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్‌ను గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో ఈవో రమణ, కాలనీ వాసులు శ్రీనివాసులరెడ్డి, రవీంద్రరెడ్డి, మధుసూదన, రామ్మోహన, ఏవీ లక్ష్మీనారాయణ, మంజునాథ, శ్రీరాములు, విజయ్‌కుమార్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బోనాల పండుగ


బోనం కూడు వండుతున్న మహిళలు

సంబేపల్లె, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోటకట్ల శివసాయి ఆలయంలో శుక్రవారం బోనాల పండుగ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మేళతాళాల నడుమ అమ్మవారి నామస్మరణలతో కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి భక్తి పూర్వకంగా మొట్టమొదటి బోనాల పండుగ జరుపుకొన్నారు. వెంకటశివసాయి దేవస్థానం ప్రాంగణం భక్త జన సందోహంతో కళకళలాడింది. ఆలయంలో తొలిసారి బోనాల పండుగ ఎంతో ఘనంగా మహిళలు జరుపుకొన్నారు. రాజరాజేశ్వరి అమ్మవారికి అభిషేకం నిర్వహించగా, అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సంప్రదాయ బోనం సమర్పించి అమ్మవారి ఆశీస్సుల కోసం పూజలు చేశారు. పాలపొంగళ్లు అమ్మవారికి బోనాలను సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గృహోపకరణాలు దగ్ధం

● విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణం

పెద్దతిప్పసముద్రం జూలై 4 (ఆంధ్ర జ్యోతి): ఓ ఇంట్లో ఎవరూ లేని సమ యంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. మల్లెల గ్రామంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ సొంత పనుల నిమిత్తం మరో ఊరికి వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవడంతో ఇంట్లోని గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. ఇంటి నుంచి దట్టమైన పొగ వస్తుండడంతో గమనించిన స్థానికులు అప్రమత్త మయ్యారు. వెంటనే విద్యుత్ సరఫరా కట్ చేసి మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఇంట్లో ఉన్న గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయన్నారు. సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అజ్మత్ పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

» మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
» అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
» మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
» డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

» ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
» క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
» పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
» నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
» ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
» సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
» వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

పసుపు సాగుపై ఆసక్తి

- రెట్టింపు సాగవుతుందని అంచనా
- గిట్టుబాటు ధరలే కారణమంటున్న రైతులు

దువ్వూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో రైతులు కుదేలవుతున్నారు. ధరల పతనం, తెగుళ్లు వెంటాడుతుండడం, పెట్టుబడులు తడిసి మోపెడు అవుతున్న నేపథ్యంలో పంటలసాగుపై


నిలువ ఉంచిన విత్తనాన్ని సాగుకు తరలిస్తున్న రైతులు

అన్నదాతకు ఆసక్తి సన్నగిల్లుతోంది. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో మంచి ఫలితాలు అందే పంటలపై మొగ్గుచూపుతున్నారు. తదనుగుణంగా ఆరుతడి పంటల సాగుపై మక్కువ కనపరుస్తున్నారు. గడిచిన మూడేళ్లుగా పసుపు పంట సాగు చేసిన రైతులు మంచి ఫలితాలు సాధించారు. ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ పంట సాగుకు ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు.

మైదుకూరు ప్రాంతం పసుపుసాగుకు పెట్టింది పేరు. ఈ ప్రాంతంలోని దువ్వూరు, చాపాడు, ఖాజీపేట, మైదుకూరు పరిసరాల్లో కేసీ ఆయకట్టు పొలాల్లో ప్రతి ఏటా ఈ పంట సాగు చేపడుతారు. ప్రతియేటలాగే ఈసారి కూడా ఈ పంట సాగును ముమ్మరం చేశారు. పొలాల్లో విత్తనం వేయడానికి ఇదే అదును కావడంతో ఆ పనుల్లో రైతులు మునిగిపోయారు. కిందటి ఏడాది దువ్వూరులో 502 ఎకరాల్లో, ఖాజీపేట 413, మైదుకూరులో 798, చాపాడులో 315, రాజుపాళెంలో 50 ఎకరాలు రైతులు పసుపు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలుపుతున్నాయి. మొత్తంగా రెండు వేల ఎకరాలకుపైగా ఈ పంట పెట్టిన రైతాంగం ధరలు ఆశాజనకంగా ఉండడంతో మంచి లాభాలు గడించారు.

రెట్టింపు సాగవుతుందని అంచనా..

మార్కెట్‌లో క్వింటాలు వట్టి పసుపు 10 వేల నుంచి 12,500 ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో నిరుడుతో పోల్చుకుంటే మైదుకూరు డివిజన్‌లో కొంచెం అటు ఇటుగా రెట్టింపు సాగవుతుందని అంచనా వేస్తున్నారు. పొలంలో విత్తనం వేసే పనులు ఇప్పుడిప్పుడే ఊపందుకున్నాయి. ఎకరాలో నాలుగు పుట్లకుపైగా విత్తనం వేస్తున్నారు. పుట్టి పసుపు ఆరు నుంచి రూ.7 వేలు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడులు తడిసి మోపెడు అవుతున్నా రైతులు సాగుకు వెనుకంజ వేయడంలేదు. మైదుకూరు ప్రాంత విత్తన కొమ్ముకు మంచి డిమాండ్ ఉంది. అక్కడి నుంచి కొనుగోలు చేసి మిగతా మండలాల్లో ఈ పంట వేస్తున్నారు. చాలా మంది రైతులు వారి పొలంలో పండిన పసుపును విత్తనంగా నిలువ ఉంచి ఇప్పుడు పొలంలో విత్తుతున్నారు. విత్తనం వేసే ముందు పొలాలకు అనుకూలమైన చెక్క, రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారు. సాలు, బోదె పద్ధతుల్లో విత్తుతున్నారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో కేసీ కాలువకు ముందుగానే సాగునీరు అందుతుందని రైతులు భావిస్తున్నారు.


పొలంలో పసుపు విత్తనం వేస్తున్న కూలీలు

బాలలహక్కుల పరిరక్షణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

కడప కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశహాల్‌లో బాలల హక్కుల పరిరక్షణ అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు, కమిషన్ విధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పిల్లల పట్ల సున్నితత్వంతో మెలగాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగు పరచాలన్నారు. ప్రతి హాస్టల్‌లో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల్లో పిల్లలను సొంత బిడ్డల్లాగా వారి బాగోగులు చూడాలని సూచించారు. పిల్లలు తమకు ఎదరయ్యే సమస్యలు, ఇబ్బందులపై ఎవరికీ చెప్పుకోలేరని.. అందుకోసం రాజ్యాంగం ప్రత్యేక హక్కులు కల్పించిందన్నారు. పిల్లల సమస్యల పరిష్కారానికి 1098 టోల్ ఫ్రీ నెంబరుకి ఫోన్ చేస్తే పరిష్కరిస్తామని కమిషన్ సభ్యురాలు తెలియజేశారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డీడీ అంజల, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసరు హిదాయుతుల్లా, ఉమెన్ పోలీసు స్టేషన్ డీఎస్పీ బాలస్వామి, బాలల సంరక్షణ అధికారి సుభాష్, సంక్షేమ హాస్టళ్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్య కేసులో జీవితఖైదు


జీవిత ఖైదు శిక్ష పడిన మల్లికార్జున

కడప క్రైం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కడప తాలుకా పీఎస్ పరిధిలో ఆరేళ్లక్రితం అనుమానంతో తన భార్యను వేధింపులకు గురి చేసి గొంతు నులిమి హత్య చేసిన కేసులో నిందితుడు జరిపిటి మల్లికార్జున (41)కు జీవితఖైదు, రూ.1.60 లక్షలు జరిమానా విధిస్తూ కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేశ్ కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా.. కడప ఏఎస్ ఆర్‌నగర్‌లో నివశించే మల్లికార్జున చిత్తూరు జిల్లాకు చెందిన తమ్మిశెట్టి గంగాదేవితో 2012లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మల్లికార్జున పండ్లను విక్రయిస్తూ కుటుం బాన్ని పోషించేవాడు. భార్య గంగాదేవిపై అనుమానం పెంచుకుని హత్య చేస్తానని బెదిరించేవాడు. ఈ క్రమంలో 2019 లో తన భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. మృతురాలి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు అప్పటి తాలుకా సీఐ విశ్వనాథరెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కాగా విచారణలో సాక్ష్యాలతో సహా నేరం నిరూపణ కావడంతో మల్లికార్జునకు జీవిత ఖైదు, రూ.1.60 లక్షలు జరిమానా విధిస్తూ కడప 7వ ఏడీజే కోర్టు జడ్జి తీర్పు ఇచ్చారు. సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచి సాక్ష్యాధారాలతో నేరస్తుడికి శిక్షపడేలా కృషి చేసిన కడప తాలుకా సీఐ రెడ్డప్ప, కోర్టు కానిస్టేబుల్ రఘురాముడు, కోర్టుమానిటరింగ్ సెల్ హెడ్‌కానిస్టేబుల్ రాజులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

యువతి హత్య కేసులో ముగ్గురికి పదేళ్లు జైలు


జైలుశిక్ష పడిన ముద్దాయిలు వీరే...

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి హత్య కేసులో ముగ్గురు నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ కడప నాలుగవ ఏడీజే కోర్టు జడ్జి జి.దీనా బాబు శుక్రవారం తీర్పునిచ్చారు. పోరుమామిళ్ల పీఎస్ పరిధిలోని రామాయపల్లె శ్మశానం వద్ద 2019లో ఓ మతిస్థిమితం లేని యువతిని గొంతు నులిమి హత్యచేశారని పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి సీఐ నిందితులను అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు. విచారణలో పోరుమామిళ్ల బెస్తవీధికి చెందిన షేక్ జిలానీబాషా, ముస్లిం కోటవీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా, కట్టకిందపల్లెకు చెందిన కారు నాగేంద్ర ప్రసాద్‌లు యువతిని గొంతునులిమి హత్య చేసినట్లు నేరం రుజువు కావడంతో శుక్రవారం ఆ ముగ్గురికి పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. కేసులో శిక్ష పడేలా అప్పటి సీఐ మోహన్‌రెడ్డి, సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి శిక్షపడేలా కృషి చేసిన పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి, కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్యలను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

కానిస్టేబుల్ అని నమ్మించి... పెళ్లి చేసుకున్న వ్యక్తిపై ఫిర్యాదు


కానిస్టేబుల్ దుస్తుల్లో భానుప్రకాశ్ (ఫైల్)


పెళ్లి సమయంలో. భానుప్రకాశ్

పోరుమామిళ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తాను కానిస్టేబుల్ అని నమ్మించి ఓ యువతిని వివాహం చేసుకొని మోసం చేయడంతో ఆ వ్యక్తిపై యువతి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... సత్యసాయి జిల్లా తనకల్లు మండలం తుమ్మలవారిపల్లె ప్రాంతానికి చెందిన భానుప్రకాశ్ అనే వ్యక్తి తాను కానిస్టేబుల్ అని పోరుమామిళ్ల మండలం కమ్మవారిపల్లెకు సమీపంలో నివశిస్తున్న ఓ యువతిని నమ్మించి 2024 అక్టోబరులో వివాహం చేసుకున్నాడు. వివాహ సమయంలో కట్నం కింద రూ.3లక్షల నగదు, 15 తులాల బంగారు నగలు ఇచ్చినట్లు యువతి బంధువులు తెలిపారు. వివాహం అయిన తరువాత తాను ఏఆర్ కానిస్టేబుల్ అని చెప్పి హైదరాబాదులో సంసారం పెట్టి నమ్మించాడు. 8 నెలలుగా డ్యూటీకి వెళ్లకపోవడంతో అనుమానం వచ్చిన ఆ యువతి నిలదీయగా.. తాను కానిస్టేబుల్ కాదని ఏం చేస్తారో చేసుకోండని బెదిరించాడు. అదనంగా డబ్బులు కావాలని వేధించేవాడు. దీంతో ఆ యువతిని అతని నుంచి తప్పించుకుని కమ్మవానిరిపల్లె సమీపంలో ఉన్న తన స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులకు జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో వారు శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్ఐ కొండారెడ్డిని వివరణ కోరగా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి



పంటల బీమా గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కడప కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు సంబంధించిన గోడపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, భారత ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఫసల్ బీమా పథకాన్ని రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. తుఫాన్లు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం, వాతావరణ అంశాల ఆధారంగా సంభవించే పంట నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లించడం పంటల బీమా పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎంపిక చేసిన పంటల సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకానికి అర్హులన్నారు. బీమా చేసిన మొత్తానికి 2 శాతం వాణిజ్య, ఉద్యాన పంటలకు 5శాతం, వాస్తవంగా నోటిఫై చేసిన ప్రీమియం శాతం ఇంకా తగ్గిన సందర్భంలో ఆ మొత్తాన్ని చెల్లిస్తే సరిపోతుందన్నారు. వాస్తవ ప్రీమియంలో రైతు చెల్లించగా మొత్తాన్ని బీమా కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయన్నారు. వాతావరణ ఆధారిత పంటల విషయంలో వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి వేగం అర్ధత వంటి వాతావరణ అంశాల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేసి ఆయా మండలాల పరిధిలో బీమా లెక్కించి చెల్లించడం జరుగుతుందన్నారు. ఎలాంటి దళారులు మధ్యవర్తులను నమ్మి పోవద్దన్నారు. పంట వేసిన ధ్రువ పత్రం జారీ నిమిత్తం కూడా ఎటువంటి మొత్తాన్ని రైతు సేవా కేంద్రంలో చెల్లించాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు చంద్ర నాయక్, రవి చంద్రబాబు, ఎల్డీఎం జనార్ధన్ పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజాన్ని నిర్మిద్దాం..

- పీ-4 పథకం అమలుపై సీఎం చంద్రబాబు దిశానిర్దేశం


కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని ఆంధ్రప్రదేశ్ సచివాయం నుంచి పీ-4 పథకం అమలుపై మార్గదర్శులు, బంగారు కుటుంబాలు అనే అంశంపై జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సమీక్షలో కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అతిదిసింగ్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సరైన సమయంలో సాయం నిరంతర మార్గనిర్ధేశనం అన్నారు. పేదరికంపై యుద్ధం చేసి చరిత్ర సృష్టించాలన్నారు. బంగారు కుటుంబాలకు సంక్షేమ పథకాల్లో ఎలాంటి కోత ఉండదని సీఎం స్పష్టం చేశారు. పీ-4 అమలులో బాపట్ల జిల్లా టాప్‌లో ఉందన్నారు. పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే పీ-4 పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రాష్ట్రంలో 2029 నాటికి పేదరికాన్ని రూపుమాపాలనే లక్ష్యంతో కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు పని చేయాలన్నారు. పీ-4 విధానంలో పేదలకు సాయం చేస్తూనే ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఆర్థికంగా స్థిరపడిన 10 శాతం మందితో అట్టడుగు పేద రికంలో ఉన్న 20 శాతం మందితో అనుసంధానం చేసే విధానమే పీ-4 పథకమన్నారు. పేదరికం లేని సమాజానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలు తదితరాలపై ముఖ్యమంత్రి కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో సీపీవో హాజరత్తయ్య, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, అగ్రికల్చర్ జేడీ చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

- ఆసుపత్రి వద్ద బంధువుల అందోళన


డాక్టర్‌తో మాట్లాడుతున్న మృతుడి బంధువులు

పులివెందుల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని గోటూరు సమీపంలో జరిగిన ద్విచక్రవాహనం ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకెళితే.... తొండూరు మండలం సైదాపురానికి చెందిన లక్ష్మీనారాయణరెడ్డి (53) గంగరాజు మోటర్‌బైకులో వస్తుండగా ఉన్నట్లుండి రోడ్డుపైకి గేదె వచ్చింది. దీన్ని తప్పించబోయి అదుపుతప్పి మోటర్ బైకు కిందపడింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణరెడ్డి తలకు గాయాలయ్యాయి. గంగరాజుకు స్వల్ప గాయాలు కావడంతో వీరిని పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లక్ష్మీనారాయణరెడ్డికి తలకు గాయం కావడంతో చికిత్స కోసం ఆసుపత్రిలో జాయిన్ చేసుకున్నారు. చికిత్స పొందుతుండగా అర్ధరాత్రి లక్ష్మీనారాయణరెడ్డి మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వైద్యం చేయడం చేతకాకపోతే మరో ఆసుపత్రికి తీసుకెళ్లేవారమని మృతుడి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపుచేశారు. డాక్టర్ కుటుంబ సభ్యులతో మంతనాలు జరపడంతో సమస్య సద్దుమణిగింది. దీనిపై తొండూరు ఎస్ఐ ఘనమద్దిలేటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధం

లింగాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కామసముద్రం గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైంది. గ్రామానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తికి సంబంధించిన గడ్డివామి పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.30వేలు నష్టం వాటిల్లింది. ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

అరగుండుతో నిరసన దీక్ష



దీక్ష చేస్తున్న బాస్, దళితసంఘం నేతలు

మదనపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బుద్ధునికొండపై గౌతమ బుద్ధుడి తల నరికిన ఘటనపై బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్ అరగుండుతో దీక్ష చేపట్టారు. స్థానిక బెంగళూరురోడ్డులోని న్యూ అంబేడ్కర్ సర్కిల్‌లో రెండోరోజు దళితసేన కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో దళితసేన సభ్యులు అరగుండు, అరమీసంతో వినూత్న నిరసనతో సంఘీభావం ప్రకటించారు. ఈ ఘటనపై మతోన్మాదులకు పోలీసులు సహకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. దీక్షలో బాస్ నేతలు ముత్యాల మోహన్, చాట్ల బయన్న, గంపల రమణ, వై.గంగాధర్, తలారి కృష్ణ, నాగరాజు, నీరుగట్టి రమణ, గిరిజననాయకుడు, కోనేటి దివాకర్ పాల్గొన్నారు. కాగా, దీక్ష వద్దకు పోలీసులు మధ్యాహ్నం పెద్దఎత్తున చేరుకున్నారు. దీక్షను భగ్నం చేసే ప్రయత్నం చేసినా ఆందోళనకారులు అడ్డుకున్నారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట కూడా చోటు చేసుకుంది.

రైళ్లల్లో ముమ్మరంగా తనిఖీలు



కడప క్రైం, జూలై 4 (ఆంధ్ర జ్యోతి) : ఏపీ ప్రభుత్వం గంజా యి, మత్తు పదార్థాల అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఎస్పీ ఆదేశాలతో రైళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. ఎర్రగుంట్ల-కడప మార్గంలో ముంబై నుంచి చెన్నై ఎగ్మోర్ వెళుతున్న రైల్లో కడప మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి ఆధ్వర్యంలో ఈగల్, రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్పెషల్ పార్టీ, పోలీసు, డాగ్‌స్క్వాడ్ బృందాలతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నిర్మూలన కోసం ప్రత్యే కంగా టోల్‌ఫ్రీ నెం.1972 ఏర్పాటు చేశారని, ఈ నెంబరుకు సమాచారం ఇస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో కడప వన్‌టౌన్ ఎస్ఐ అమర్ నాథరెడ్డి, కడప రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, స్పెషల్‌పార్టీ ఈగల్‌టీం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకంజలో చిత్తూరు, అనంతపురం జట్లు






మన్విత్‌రెడ్డి, (నెల్లూరు), ఎస్ఎస్ హుస్సేన్ (నెల్లూరు), వీరారెడ్డి (అనంతపురం)

కడప స్పోర్ట్స్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మెన్స్ మల్టీడే (మూడు రోజుల) క్రికెట్ పోటీలలో భాగంగా శుక్రవారం వేర్వేరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి చిత్తూరు జట్టు నెల్లూరు జట్టు కంటే 324 పరుగుల వెనుకంజలో నిలిచింది. అదే తరహాలో కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో అనంతపురం జట్టు 74 పరుగుల తేడాతో వెనుకబడి వుంది.

ఏసీఏ మైదానంలో..: నెల్లూరు-చిత్తూరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 77.3 ఓవర్లలో 338 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో మన్విత్ రెడ్డి 140 పరుగులు చేయగా ఎస్ఎస్ హుస్సేన్ 63 పరుగులు చేశా రు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 14 పరు గులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు మరో 324 పరుగుల వెను కంజలో ఎదురీదుతోంది.

కేఓఆర్ఎం మైదానంలో..: కర్నూలు-అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు బ్యాటింగ్‌కు దిగి 59.3 ఓవర్లలో 9 వికెట్ల కోల్పోయి 213 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో విష్ణువర్ధన్‌నాయుడు 68 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 139 పరుగులు చేసింది. ఇందులో వీరారెడ్డి 62 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. దీంతో అనంతపురం జట్టు మరో 74 పరుగుల వెనుకంజలో వుంది.

పీలేరును అభివృద్ధి పథంలో నిలపాలి

బంగారు కుటుంబాల జీవన ప్రమాణాల పెంపు ● ప్రధాన మంత్రి సూర్య ఘర్‌పై విస్తృత ప్రచారం

● సీవీఏపీలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

పీలేరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రధాని 'వికసిత్ భారత్-2047', సీఎం చంద్రబాబు 'స్వర్ణాంధ్ర విజన్-2047' సాధనలో భాగంగా రూపొందించిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్(సీవీఏపీ)ను సమర్థవంతంగా, సమష్టిగా అమలు చేసి పీలేరును అభివృద్ధి పథంలో నిలపాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ (సీవీఏపీ) ప్రథమ సమావేశంలో పీడీ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం అమలులో జిల్లాలో పీలేరు నియోజకవర్గం వెనుకబడి ఉందన్నారు. ఈ పథకంపై గ్రామీణ ప్రాంతాల్లోనూ విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పీ4 విధానంలో బంగారు కుటుంబాల జీవన ప్రమాణాల పెంపునకు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. సీవీఏపీపై ఇకపై ప్రతి వారం కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తారని, ప్రభుత్వ అధీనంలోని 54 శాఖల ఉద్యోగులకు 525కీ పర్ఫామెన్స్ ఇండికేటర్లు నిర్దేశించి వాటిని అందుకోలేని వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే హైదరాబాదు నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా అధికారులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పీలేరు, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో పుష్కలంగా ఉన్న ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కుల్లో భవిష్యత్తులో మామిడి, టమోటా పంటల అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గండికోట జలాశయం నుంచి పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు సురక్షిత తాగునీటి సరఫరాకు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయన్నారు. ఏపీ ట్రాన్స్‌కో పీలేరు ఈఈ చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన ద్వారా ప్రతి ప్రభుత్వ ఉద్యోగీ తన ఇంటిపై సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. సిబిల్ స్కోరు తక్కువగా ఉన్న వారికి కూడా అన్ని జాతీయ బ్యాంకుల్లో రుణం వస్తుందన్నారు. యూనిట్ ఏర్పాటు చేసుకున్న వారం, పది రోజుల్లో కేంద్రం రూ.30 వేల రాయితీ లబ్ధిదారుని ఖాతాలో జమ చేస్తుందన్నారు. నెల వారీ విద్యుత్ బిల్లును ఈఎంఐలుగా బ్యాంకుకు కట్టేయవచ్చని, మిగులు కరెంటును ఏపీట్రాన్స్‌కోకు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం కూడా సమకూర్చుకోవచ్చన్నారు. పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షులు అమరనాథరెడ్డి, పీలేరు, కలికిరి, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం ఎంపీడీఓలు లతీఫ్ ఖాన్, భానుమూర్తి, సుధాకర్, భానుప్రసాద్, బ్రహ్మానంద రెడ్డి, మనోహర్ రాజు, అన్ని మండలాల తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, విద్యుత్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం


కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

పెద్దతిప్పసముద్రం జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త సనగరం పట్టాభిరామయ్య అధ్వర్యంలో ఆలయంలో ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను అలంకరించి కర్ణాటక రాష్ట్ర వేదపండితులు వేణుగోపాల శర్మ, ఎంఎస్. శేషాచలం శర్మ స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

గుండెపోటుతో విశ్రాంత పోస్టుమన్ మృతి



వాల్మీకిపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన పెద్ద విశ్రాంత పోస్టుమన్ గంగయ్య(90) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల, సంఘాల నేతలు, పట్టణ ప్రముఖులు గంగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. గంగయ్య 40 ఏళ్ల పాటు భారత పోస్టల్ విభాగంలో టెలీగ్రాఫ్ మెసెంజర్, గ్రూప్ డీ ఉద్యోగిగా, పోస్టుమన్‌గా నిస్వార్థ సేవలందించారు. వాల్మీకిపురం, కేవీ పల్లె, మారెళ్ల, గ్యారంపల్లె, కలికిరి, పీలేరు, తిరుపతి, తదితర ప్రాంతాల్లో ఆయన విశిష్ట సేవలందించారు. ఆయన మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గంగయ్య పోస్టుమన్‌గా ఎక్కువగా సైకిల్ ప్రయాణమే చేస్తూ ఎందరికో సుపరిచితుడు కావడం వివిధ మండలాల్లో గిరిజన సమాజంతో సుస్థిర సంబంధాలు ఏర్పరచుకుని గిరిజన నేతగా విశిష్ట గుర్తింపు పొందారు.

తాగునీటి సమస్యను తీర్చండి

గుర్రంకొండ, జూలై 4(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్యను పట్టించుకోవడం లేదని నడిమిఖండ్రిగ ఎంపీటీసీ బాబయ్య అధికారులను నిలదీశారు. ఎంపీపీ సీతమ్మ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఎంపీటీసీలు బాబయ్య, గంగులమ్మ తాగునీటి సమస్యలపై అధికారులను నిలదీశారు. మొటుకు, చింతలవారిపల్లె గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఎవరూ పట్టించుకోలేదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లాల్ స్వామికి తెలిపారు. టి.గొల్లపల్లెలో సీసీ రోడ్లు నిర్మించాలని పీఆర్ ఏఈకి చెప్పినా స్పందించలేదని వైస్ ఎంపీపీ కరుణాకర్ అన్నారు. ఆర్టీసీ బస్టాండులోకి బస్సులు వచ్చేలా చూడాలని పలువురు సభ్యులు ఎంపీడీఓ పరమేశ్వరరెడ్డిని కోరారు. వ్యవసాయానికి 9 గంటల కరెంట్ ఇవ్వాలని ఎంపీటీసీ రాజగోపాల్ ట్రాన్స్‌కో అధికారులను కోరారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

ములకలచెరువు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పాత ములకలచెరువు సమీపంలో దాడులు నిర్వహించి కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. ఈ సందర్భంగా నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రెండు కోళ్లు, రూ.4600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రైతుల ఆర్థికాభివృద్ధిలో సహకార సంఘాలు కీలకం

కలకడ, జూలై 4(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధిలో ప్రాథమిక సహకార సంఘాల పాత్ర కీలకమని కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ దుర్గమ్మ అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవంలో భాగంగా బాటవారిపల్లె హైస్కూల్ విద్యార్థులకు సంఘాల ఏర్పాటు, సభ్యుల విధివిధానాలను వివరించారు. రైతులకు ఎరువుల, విత్తనాల పంపిణీ, వివిధ రుణాల మంజూరు గురించి తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన

మదనపల్లె అర్బన్, జూలై4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజ్ గేట్ వద్ద ఎంప్లాయీస్ యూనియన్ నేతలు నిరసన తెలిపారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్‌వీ కుమార్, డిపో అధ్యక్షుడు శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. కుమార్, జాయింట్ సెక్రటరీ సుగుణ ఆధ్వర్యంలో ఏపీటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ముబారక్ సహకారంతో ధర్నా చేపట్టిన వారు మాట్లాడుతూ బ్యాటరీ బస్సులు ఆర్టీసీనే నడపాలని డిమాండ్ చేశారు.

కోర్టులో గంగమ్మకు రాహుకాల పూజలు


ఆలయంలో రాహుకాల పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు శుక్రవారం మహిళలు రాహుకాల పూజలు నిర్వహించారు. రాహు కాల సమయంలో మహిళలు చీర, జాకెట్లు, పసుపు, కుంకుమ, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మహిళలు నిమ్మకాయలపై నెయ్యివొత్తులో దీపారధన చేశారు. ఆలయంలోని అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులకు ఆలయకమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సమగ్ర అభివృద్ధే లక్ష్యం

తంబళ్లపల్లె, జూలై 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంటేషన్‌పై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం విజన్ ప్రణాళిక రూపొందించిందని ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ థామస్‌రాజా, ఎంఈఓ త్యాగరాజు, ఎస్‌ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏపీఎం గంగాధర్, ట్రాన్స్‌కో ఏఈ సురేంద్ర, ఏపీఓ అంజనప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్, ఐసీడీఎస్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో నాలుగు సారా రహిత గ్రామాలు


బాలేవాండ్లపల్లె గ్రామస్థులకు సూచనలిస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా

మదనపల్లె టౌన్, జూలై 4(ఆంధ్ర జ్యోతి): మండలంలోని నాలుగు గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటించామని ఎక్సైజ్ సీఐ భీమలింగ పేర్కొన్నారు. శుక్రవారం నిమ్మనపల్లె మండలంలో ఎక్సైజ్ అధికారులు ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా మాట్లాడుతూ మండలంలోని బండ్లపై, పారేశువారిపల్లె, నాగులయ్యగారిపల్లె, బాలేవాండ్లపల్లె గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు, వినియోగం నిషేధించామన్నారు. గ్రామ విజిలెన్స్ కమిటీ పర్యవేక్షిస్తుందని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమాజ భాగస్వామ్యంతోనే డెంగ్యూ నియంత్రణ

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): సమాజ భాగస్వామ్యంతోనే డెంగ్యూ నియంత్రణ సాధ్యమవుతుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ లక్ష్మీనరసయ్య అన్నారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ మాసోత్సవంలో భాగంగా త్యాగరాజవీధి, పట్టణంలోని ఆరోగ్య కేంద్రం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, వైద్యాధికారి జిలాన్‌తో సమీక్షించారు. డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల బ్యానర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, డ్రైడే డ్రైడే పాటించాలని. దోమతెరలను వాడాలని, కిటికీలకు మెష్‌ను కొట్టించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జిలానీ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సబ్ యూనిట్ అధికారి ఖలీల్, డీఈఓ భాస్కర్ పాల్గొన్నారు.

అధికారుల నిర్వాకంపై నిలదీత

పనితీరు సరిలేదంటూ సభ్యుల ధ్వజం

బి.కొత్తకోట, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలో పనిచేసే పలు శాఖల అధికారుల పనితీరు సరిలేదంటూ పలువురు ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. ఆయా శాఖల మండల అధికారులను వారి అసమర్థత, నిర్లక్ష్యధోరణిపై నిలదీశారు. శుక్రవారం ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో విద్య, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్, సోషియల్ వెల్ఫేర్, విద్యుత్ శాఖల ప్రతినిధులు సమాధానాలు చెప్పలేక నీళ్లు నమిలారు. పట్టణంలో రెండేళ్లుగా బినామీపేరుతో ఓ కార్పొరేట్ స్కూల్ నడుస్తోందని, టీసీలు, అడ్మిషన్లు పాతస్కూల్ పేరుతో ఇస్తూ ఫీజులు, ఇతర నిర్వహణ ఓ కార్పొరేట్ సంస్థ చేస్తుంటే ఏమి చేస్తున్నారని ఎంఈఓ రెడ్డిశేఖర్‌ను ప్రశ్నించారు. బోరుమోటార్ల ట్రాన్స్‌ఫార్మర్‌ల కోసం దరఖాస్తులు ఎన్నివున్నాయో, ఎందరికిచ్చారో తెలియదన్న ట్రాన్స్‌కో అధికారిని, బీసీ హాస్టల్స్‌ను సరిగా నిర్వహించక పోగా ఎక్స్‌పోజింగ్ చేస్తూ కనపడిన వార్డెన్‌ను, సిబ్బంది సకాలంలో హాజరు కాకున్నా, బాలికలకు నీరుకూడా లేకున్నా స్పందించలేదని కస్తూర్బా ఎస్‌ఓను, అంగన్వాడీల పనితీరుపై ఐసీడీఎస్ అధికారిపై అసహనం వ్యక్తమైంది. స్పెషలాఫీసర్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ సమావేశంలో లేవనెత్తిన అన్ని అంశాలపై అధికారులు స్పందించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ బావాజాన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో తప్పులు జరగడంతో పలువురు రైతులు ప్రభుత్వ పథకాలు కోల్పోయారన్నారు. ఎంపీడీఓ క్రిష్ణవేణి ప్రభుత్వ ఉత్తర్వులను వివరిస్తూ సభను నడిపించారు. మండలమీట్‌కు గైర్హాజరైన వారికి నోటీసులిస్తామన్నారు. జడ్పీటీసీ రామచంద్ర, వైస్‌ఎంపీపీ ఖాదర్‌వల్లి, సీడీపీఓ భాగ్యమ్మ, ఏపీఓం రాజేశ్వరి, ఓంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

జంతు పరిశోధన నైతికతపై జాతీయ సదస్సు

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మండలం, సీటీఎం సమీప మహతి కాలేజీ ఆఫ్ నర్సింగ్‌లో శుక్రవారం 'జంతు పరిశోధనలో నైతికత అంశాలు వాటి సంక్షేమ సాధనలు' అంశాలపై జాతీయ స్థాయితో సదస్సును నిర్వహించారు. ఇందులో దేశ వ్యాప్తంగా 323 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీకే ప్రకాష్‌రెడ్డి, సీసీఎస్‌సీఏ ప్రతినిధి డాక్టర్ ఈశ్వర్ సదస్సును ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా మహతి కళాశాల చైర్మన్ అమరనాధరెడ్డి, వైస్ చైర్మన్ మహతి హాజరయ్యారు. కార్యక్రమంలో సోమశేఖరెడ్డి, డాక్టర్ హుస్సాన్ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

పనితీరును చూసే పార్టీలో గుర్తింపు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకుడు గురుమూర్తి గౌడ్

మదనపల్లె టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ నిబంధనలు, సిద్ధాంతాలు అనుసరించి పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలకు తగిన గుర్తింపు వుంటుందని సంస్థాగత ఎన్నికల రాష్ట్ర పరిశీలకులు గురుమూర్తి గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్‌వీఆర్ కల్యాణ మండపంలో నిమ్మనపల్లె టీడీపీ నేతలు, కార్యకర్తలతో సంస్థాగత ఎన్నికల విషయమై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి గ్రూపులు లేవని, అందరూ చంద్రబాబు గ్రూపే అన్నారు. రెండు రోజులుగా జరిగిన మదనపల్లె మండలం, టౌన్, నిమ్మనపల్లె మండలాల టీడీపీ అధ్యక్ష పదవికి పదుల సంఖ్యలో ఆశావహులు తమ పేర్ల జాబితాను పరిశీలకులకు అందజేశారు.

టీడీపీ కార్యకర్తలైనందుకు గర్వపడండి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్


సమావేశంలో మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, జూన్4(ఆంధ్రజ్యోతి): పార్టీ నూతన కార్యవర్గంతో స్థానికసంస్థల ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరముందని, ప్రతి కార్యకర్త నిస్వార్థంగా పార్టీ కట్టుబాట్లకు కట్టుబడి వుండాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ అన్నారు. శుక్రవారం పార్టీ అబ్జర్వర్ శీతప్ప ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాల్లో టీడీపీ పట్టణ నూతన కార్యవర్గ ఎంపికలో ఆమె మాట్లాడుతూ నూతనకార్యవర్గ ఏర్పాటులో అందరికీ న్యాయం జరుగుతుందని, వార్డు, బూత్, పట్టణ. జిల్లా స్థాయి వరకు ప్రతి పదవికి కోకన్వీనర్ కూడా ఉంటారన్నారు. 1,2,3 వార్డుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక ఏకగ్రీవం కాగా, మిగతా 17 వార్డుల అధ్యక్ష బాధ్యతలపై కార్యకర్తలు పోటీ పడ్డారు. కార్యక్రమంలో నేతలు బంగారు వెంకట్రమణ, డేరింగుల నారాయణ, గంజిమోహన, కనకంటిప్రసాద్, ఓబులేసు, సమీవుల్లా, మస్తాన్, నాసిర్, చావిడికిట్టన్న, ప్రభాకర్, రంజిత్, చాకనారాజా తదితరులు పాల్గొన్నారు

పదేళ్ల అభివృద్ధి ఏడాదిలో చేసి చూపించా

సుపరిపాలన-తొలిఅడుగులో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ పరిశీలకులు

మదనపల్లె టౌన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా వైసీపీ పాలకులు చేయని అభివృద్ధిని ఏడాదిలోనే తాను చేసి చూపించానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్పష్టం చేశారు. శుక్రవారం కోళ్లబైలు-1 పంచాయతీలో సుపరిపాలన-తొలిఅడుగులో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్ర పరిశీలకులు గురుమూర్తి గౌడ్, నియోజకవర్గ పరిశీలకులు సురేష్, టీడీపీ నేతలు రాటకొండ శ్రీనివాసులు, షంషీర్, నాదెళ్ల శివన్న, సహదేవ, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి వైపు అడుగులు

తంబళ్లపల్లె/బి.కొత్తకోట, జూలై 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని రక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇపుడు అభివృద్ధి వైపు అడుగులేస్తున్నారని తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా టీడీపీ ఇన్‌చార్జి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు పురుషోత్తం, పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, తెలుగు యువత నరసింహులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, ఎస్‌ఎంసీ చైర్మెన్లు వీరాంజనేయులు, శివకుమార్, టైల్స్‌శీన, వికలాంగ అధ్యక్షుడు రామాంజులు, కాలా నారాయణ, మదన, సురేంద్ర, సోము తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పర్యటించారు. ఆయన వెంట స్థానిక నేతలు, బూత్‌ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కేఎస్‌ఎస్ సభ్యులు, సచివాలయ సిబ్బంది వున్నారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

పీలేరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ఏడాదిలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని టీడీపీ నేతలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. టీడీపీ నేతలు స్థానిక కోటపల్లె, మోడల్ కాలనీ, ఎర్రగుంటపల్లె గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, నేతలు పాల్గొన్నారు.

రేపు రుద్రహోమం

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): చిప్పిలి గ్రామంలో వెలసిన యోగభోగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఆషాడమాసం శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని రుద్రహోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అన్నదానం నిర్వహిస్తునట్లు ఆయన చెప్పారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

తంబళ్లపల్లె, జూలై 4(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన నగదును పోలీస్‌స్టేషన్‌లో అందజేసి ఆటో డ్రైవర్ బావాజాన్ తన నిజాయితీని చాటుకుని పోలీసుల చేత శభాష్ అనిపించుకున్నాడు. తంబళ్లపల్లె వాసి ఆటోడ్రైవర్ బావాజాన్ శుక్రవారం మధ్యాహ్నం పెద్దమండ్యం రోడ్డులో ఆటో నడుతూ వెళ్తుండగా వైన్‌షాపు వద్ద రూ.23,300 నగదు దొరికింది. ఆ సమయంలో ఎవరూ లేరు. వెంటనే తోటి ఆటోడ్రైవర్ కరీంతో కలసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి దొరికిన నగదును ఎస్‌ఐ ఉమామహేశ్వరరెడ్డికి అందచేశాడు. ఆటోడ్రైవర్ నిజాయతీని ఎస్‌ఐ సహా సిబ్బంది అభినందించారు. బాధితులు సంప్రదిస్తే పరిశీలించి నగదును అందజేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

తాగునీటి బోర్లకు జియో ట్యాగింగ్

పెద్దమండ్యం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ తాగునీటి పథకం బోర్లకు జియో ట్యాగింగ్ చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ వెల్లడించారు. శుక్రవారం కలిచెర్లలో తాగునీటి పథకం బోర్లకు జియో ట్యాగింగ్ ప్రక్రియ చేసిన ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పథకం ద్వారా 71 బోర్లు అందుబాటులో వున్నట్లు తెలిపారు. వాటిలో 22 తాగునీటి ట్యాంకులు వున్నట్లు వెల్లడించారు. ఈ విధానంతో మరమ్మతులకు గురైన బోర్లును ఉన్నతాధికారులు వెంటనే గుర్తిస్తారని తెలిపారు.

పైపులైన్ ఏర్పాటు అడ్డగింత

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): తన పొలంలో దౌర్జన్యంగా పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారంటూ మహిళ అడుకుంది. పోతబోలు గ్రామం, పాలెంకొండ రెవెన్యూ సర్వేనెంబరు 1120 లోని అదే గ్రామానికి చెందిన కృష్ణమూర్తి స్థానిక నేతల సహకారంతో తన సెటిల్‌మెంట్ భూమిలో ఎక్స్‌కవేటర్‌తో దౌర్జన్యంగా పైపులైన్ వేస్తుండగా బాధితురాలు షేక్ ప్యారాజాన్ కుమారై షేక్ ముస్వరునీసా అడ్డుకున్నామన్నారు. ఇష్టం వచ్చిన వారికి చెప్పుకోమంటూ ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న ఆమెను పక్కకులాగేశారని వారు విలపించారు. వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ అమర్ వచ్చి దౌర్జన్యం చేసిన వారికే సహకారం అందించారని ఆరోపించారు.

వైద్యశాఖలో బదిలీలు

పెద్దమండ్యం, జూలై 4(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం ప్రభుత్వాస్పత్రి సిబ్బంది బదిలీ జరిగినట్లు డాక్టర్ ఇమ్మానుయేల్ శుక్రవారం వెల్లడించారు. డాక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ సీహెచ్‌ఓగా మురళీధర్ విధుల్లోకి చేరినట్లు తెలిపారు. ఇక్కడ సీహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న క్రిష్ణయ్య జీడీ నెల్లూరుకు బదిలీ అయ్యారు. గుర్రంకొండ మండలం నుంచి కొత్తగా స్టాఫ్‌నర్స్ ఫరీదా, సుండుపల్లి మండలం నుంచి హెల్త్ సూపర్‌వైజర్ రమణమ్మ బదిలీపై పెద్దమండ్యం మండలానికి వచ్చారు. పీహెచ్‌సీలోని యూడీసీ షఫీ బదిలీపై చౌడేపల్లికి వెళ్లినట్లు తెలిపారు.

'ధూపదీప నైవేద్యం' అమలు

మదనపల్లె అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): వలసపల్లె పంచాయతీ, కాకరకాయలపల్లెలో కొత్తగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని జిల్లా దేవాదాయశాఖ అధికారి శుక్రవారం సందర్శించారు. ఇటీవల సీజీఎఫ్ రూ. 60లక్షల నిధులతో ఆలయ నిర్వాహకులు వెంకటరమణకు ధూపదీప నైవేద్యం పథకం అమలు చేశారు. దీంతో ప్రతి నెలా పదివేలు రూపాయలు ఆలయానికి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, వెంకటరమణ, అంకన్న, బద్దెల గోవర్ధన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాజ హితమే ఎమ్మార్పీఎస్ ధ్యేయం

వాల్మీకిపురం, జూలై 4(ఆంధ్రజ్యోతి): సమాజ హితమే ఎమ్మార్పీఎస్ ధ్యేయమని ఈ నినాదాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లి నూతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి డానియల్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు గంటా బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం 30ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నూతన గ్రామ కమిటీల ఏర్పాటు, గ్రామ గ్రామాన 7న ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

ఉన్మాదులను శిక్షించాలి

పీలేరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): బుద్ధుడి కొండలో బుద్ధ విగ్రహం ధ్వంసం చేసిన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలకుంట శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కొందరు ఉన్మాదులు కొండలో ఒక్కొక్కటిగా ధ్వంసం చేయడం ఆటవిక చర్యగా అభివర్ణించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని సూచించారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్ర సమస్యగా పరిగణించి ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎన్. రామచంద్ర, హరిప్రసాద్, సలీమ్, భాస్కర్ పాల్గొన్నారు.

దోమలే శత్రువులు

పీలేరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): దోమలే ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆయన కోటపల్లె ప్రాంతంలో పర్యటించారు. డెంగ్యూకు కారణమయ్యే టైగర్ దోమ, దాని సంతతి పెరుగుదలను నివారించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.